విలేఖరులు కావలెను

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com

ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

తెలుగు జాతీయ దిన పత్రిక

TELTEL/2012/47103

సంపుటి : 12 సంచిక :85 నల్గొండ బుధవారం 18-06-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ పేజీలు : 4 వెల : రూ.1/-

## గత ప్రభుత్వ హయాంలో ఫోన్ల ట్యాప్



హైదరాబాద్,జూన్ 17: గత ప్రభుత్వం తమ ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు అనుమానం రావడంతోనే సీపీకు ఫిర్యాదు చేసినట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణకు ఆయన హాజరయ్యారు. ఈ కేసులో సాక్షిగా ఆయన తన వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'టెలిగ్రాఫ్ చట్టానికి తూట్లు పొడుస్తూ మా ఫోన్లను ట్యాప్ చేశారు. రాజకీయ నాయకుల ఫోన్లు ట్యాప్ చేయడం హేయమైన చర్య. ఈ చర్యకు పాల్పడిన కేసీఆర్, కేటీఆర్ సిగ్గుతో తలవంచుకోవాలి. రాజకీయాల్లో భారాస నేతలే ఉండాలనే దురుద్దేశంతో మా ఫోన్లు ట్యాప్ చేశారు. గతంలో కాంగ్రెస్ ఓడిపోవడానికి ఫోన్ల ట్యాపింగే కారణమని తెలుస్తోంది. రేవంత్ రెడ్డితో పాటు నా ఫోన్ కూడా ట్యాప్ చేసి మా కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఇదే ఫిర్యాదును గతంలోనూ చేశాను. ఇవాళ వాస్తవాలు బయటకు వచ్చాయి. చట్టానికి వ్యతిరేకంగా అనేకమంది ఫోన్లను ట్యాప్ చేశారు. 2022 నుంచి సీనియర్ కాంగ్రెస్ నాయకుల ఫోన్లు ట్యాపింగ్‌లో ఉన్నాయి. సిట్ దర్యాప్తులో 650 మంది కాంగ్రెస్ నాయకుల పేర్లు జాబితాలో ఉన్నాయని తెలిసిందన్నారు. 'కుంభం అనిల్ కుమార్ యాదవ్, గాలి అనిల్‌తోపాటు అనేకమంది ఫోన్లు ట్యాప్ అయినట్లు బయటికి వచ్చింది. ఇవన్నీ చూస్తుంటే, నాడు ఏ రకంగా అధికారాన్ని దుర్వినియోగం చేసి దుశ్చర్యకు పాల్పడ్డారో అర్థమవుతోంది. ప్రజాస్వామ్యంలో నిక్కచ్చిగా పనిచేయాల్సిన అధికారులు.. రాజకీయ నాయకులకు తలొగ్గి అడుగులకు మడుగులొత్తారు. ప్రైవసీ అనేది మా ప్రాథమిక హక్కు.. దానిని కాలరాశారు. పదవీ విరమణ చేసిన ప్రభాకర్‌రావును దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పెట్టారు. నక్సలైట్లకు సానుభూతిపరులుగా ఉన్నారని మమ్మల్ని ట్యాప్ చేయడం సిగ్గుచేటు. కేటీఆర్ సిగ్గుతో తల దించుకోవాలి' 'ఆనాడు మా ఫోన్లు ట్యాప్ చేసి రాజకీయ లబ్ది పొందేందుకు ప్రయత్నం చేశారు. దానికి మీరు శిక్షార్హులు. భవిష్యత్తులో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి దుశ్చర్యకు పాల్పడకుండా ఉండాలంటే వీరికి శిక్ష పడాల్సిందే. ఇలాంటి దిగజారుడు పనికి ఒడిగట్టిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు కూడా శిక్ష పడాలి. సజావుగా విచారణ జరిపి... రాజకీయ నాయకులైనా, అధికారులైనా... బాధ్యులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం' అని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో (ఖఠనీని। ఈుజూతినిణ అజీబ।) సిట్ అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసులో బాధితుల నుంచి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసే ప్రక్రియను సిట్ మొదలుపెట్టింది. ఇప్పటికే కొంతమంది బాధితుల స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసిన సిట్.. తాజాగా ఈ కేసులో సాక్షిగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వాంగ్మూలాన్ని రికార్డు చేయాలని నిర్ణయించి.. ఆయనకు సమాచారం అందించారు. ఇందులో భాగంగా మంగళవారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు మహేష్ కుమార్ చేరుకున్నారు. దీంతో జూబ్లీహిల్స్ పీఎస్ ముందు కాంగ్రెస్ కార్యకర్తల హడావిడి నెలకొంది. సిట్ కార్యాలయానికి పెద్దఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు చేరుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లేందుకు యత్నించిన కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని బయటకు పంపించి వేశారు. ఈ క్రమంలో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య స్వల్ప తోపులాట చోటు చేసుకుంది. కాగా.. ప్రస్తుతం టీపీసీసీ చీఫ్‌గా వ్యవహరిస్తున్న మహేష్ కుమార్.. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఆ సమయంలో తన ఫోన్‌ను ట్యాప్ చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ప్రణీత్ రావును అరెస్ట్ చేసి ఆయనకు సంబంధించి ఫోన్లను రికవరీ చేసిన సమయంలో అందులోని డేటాను విశ్లేషించగా.. మహేష్ కుమార్ గౌడ్‌కు చెందిన అంశాలు బయటపడ్డాయి. దీంతో ఆయన ఫోన్ ట్యాప్ అయినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో మహేష్ కుమార్‌ను బాధితుడిగా భావించి ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేయాలని నిర్ణయించారు.

## బీసీ రిజర్వేషన్లకై.. జులై 17న రాష్ట్ర వ్యాప్తంగా రైల్‌రోకో : ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్ : బీసీ రిజర్వేషన్లకై జులై 17న రాష్ట్ర వ్యాప్తంగా రైల్‌రోకో కార్యక్రమానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. అన్ని బీసీ సంఘాల నాయకులను కలుపుకొని రైల్‌రోకోలో పాల్గొంటామని ఆమె పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో బీసీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్లపై బిల్లు ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి చేస్తామన్నారు. ఢిల్లీ పాలకులకు తెలంగాణ బీసీల పౌరుషం ఏంటో చూపిస్తాం. ఢిల్లీ పాలనకు సెగ తాకేలా రైల్ రోకో ఉంటుంది. 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలు నిర్వహించనివ్వబోం. 42 రిజర్వేషన్లు ఇవ్వకుండా కాంగ్రెస్ కుట్ర చేస్తుంది. బీసీ విద్యార్థులు, మహిళలు ఈ ఉద్యమంలో పెద్ద ఎత్తున కలిసిరావాలి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ జాగృతి పోరాటం చేస్తోంది అని కవిత ప్రకటించారు.తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఒత్తిడితోనూ అసెంబ్లీలో ప్రభుత్వం మూడు బీసీ బిల్లులు పెట్టింది. వార్డు మెంబర్, సర్పంచ్‌లు కాని అనేక కులాలు బీసీల్లో ఉన్నాయి. అసెంబ్లీ గడప తొక్కని అనేక కులాలు ఉన్నాయి. రాజకీయ అవకాశాల్లో బీసీ మహిళల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మహిళా రిజర్వేషన్లలో బీసీలకు ఉప కోటా ఉండాలి. ఇది రాజకీయ వేదిక కాదు ఇది మానవ హక్కులు, సామాజిక హక్కులు వేదిక. సమాజంలో 56 శాతం జనాభాకు సంబంధించి హక్కులు కోరుతుంటే అవి మానవ హక్కులు కావా..? ఇప్పుడు మాట్లాడాల్సిన సందర్భం వచ్చింది.. కాబట్టి అందరూ కలిసికట్టుగా హక్కుల కోసం పోరాటం చేయాలి. సరైన సమయంలో జాగృతి మాట్లాడింది కాబట్టి అసెంబ్లీలో మూడు బిల్లులు వచ్చాయి. అదే స్ఫూర్తితో బీసీ బిల్లులను కేంద్రం ఆమోదించేలా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని కవిత పేర్కొన్నారు.ఢిల్లీకి బిల్లు పంపించి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకుంది. మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు బీసీ బిల్లు గురించి ఒక్క రోజు కూడా మాట్లాడలేదు. రఘునందన్ రావు బీసీల కోసం ఎందుకు మాట్లాడడం లేదు..? కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ బిల్లును ఎందుకు ఆమోదించడం లేదని ప్రతీ ఒక్కరు రఘునందన్ రావును ప్రశ్నించాలి. కులగణన వివరాలను కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల వారీగా ప్రకటించాలి. రౌండ్ టేబుల్ సమావేశానికి రానివ్వకుండా బీసీ నాయకులను మెదక్‌లో కొంత మంది బెదిరించే ప్రయత్నం చేశారు. దీన్ని బట్టే వాళ్లు భయపడుతున్నారని అర్థమవుతోంది అని ఎమ్మెల్సీ కవిత అన్నారు.

## నా రాజీనామా కోరే నైతిక హక్కు మీకు లేదు..



బెంగళూర్ : బీజేపీ తీరుపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నెల 4న చిన్నస్వామి స్టేడియం లో జరిగిన తొక్కిసలాటకు బాధ్యత వహిస్తూ కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ హెూంమంత్రి పరమేశ్వర రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ఫ్రీడమ్ పార్కు లో బీజేపీ ఆందోళనకు దిగడంపై సిద్ధరామయ్య స్పందించారు.

తనను రాజీనామా చేయమని డిమాండ్ చేసే నైతిక హక్కు బీజేపీకి లేదని సిద్ధరామయ్య మండిపడ్డారు. మహాకుంభమేళా తొక్కిసలాటలో 30 మంది మరణించారని, అందుకు బాధ్యత వహిస్తూ అక్కడి సీఎం రాజీనామా చేశారా..? అని ఆయన ప్రశ్నించారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో 241 మంది ప్రాణాలు కోల్పోయారని అందుకు బాధ్యత వహిస్తూ ఎవరు రాజీనామా చేశారని నిలదీశారు.అంతకు ముందు నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి కూలి 140 మంది మరణించారని, అందుకు బాధ్యత తీసుకుని ఎవరూ రాజీనామా చేయలేదు ఎందుకని సిద్ధరామయ్య ప్రశ్నించారు. అయినా నన్ను నేను రక్షించుకోవడానికి ఈ ఉదాహరణలు చెప్పడంలేదని, రాష్ట్రంలో ఏది జరిగినా ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం కరెక్టు కాదని అన్నారు.

## రేవంత్ ఓట్లకు ఓట్లకు మధ్య ఇస్తున్నారు: పెద్ది సుదర్శన్ రెడ్డి



హైదరాబాద్, స్థానిక సంస్థల ఎన్నికలు తప్పనిసరి అయిన పరిస్థితుల్లో ఓట్ల కోసం రైతు భరోసా పేరిట నాటకానికి తెరతీశారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి బజారు రౌడీ కన్నా హీనంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు భరోసా స్థానిక సంస్థల స్టంట్ మాత్రమేనని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఎలా వచ్చేదో.. ఇప్పుడు ఎలా వస్తుందో.. రైతులు ఆలోచించుకోవాలని సూచించారు.ప్రజలను అన్ని రకాలుగా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఓట్లు ఎలా అడుగుతుందని పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే కాంగ్రెస్ నేతలను అడుగడుగునా నిలదీయాలని కోరారు. ఎకరాకు రూ.25 వేల బకాయిలు ఇచ్చే వరకు స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ నేతలను రానివ్వద్దని సూచించారు. కేసీఆర్ నాట్లకు, నాట్లకు మధ్య రైతుబంధు ఇచ్చే వారని.. రేవంత్ రెడ్డి ఓట్లకు ఓట్లకు మధ్య రైతు భరోసా ఇస్తున్నారని విమర్శించారు. సర్పంచుల పాత బిల్లులకు తమకు సంబంధం లేదని సీఎం రేవంత్ రెడ్డి విడ్డూరంగా మాట్లాడారని అన్నారు. అలా అయితే కేసీఆర్ ప్రాణాన్ని పణంగా పెట్టి తీసుకొచ్చిన తెలంగాణతో, ఆయన కట్టిన సచివాలయంతో రేవంత్ రెడ్డికి ఏం సంబంధం అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి తెలంగాణ పాలకుడు కాదని అన్నారు.ధాన్యం కొనుగోళ్ల విషయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పేది శుద్ధ తప్పు అని పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. పంటల కొనుగోళ్లు విషయంలో రైతులు ఈసారి పడిన ఇబ్బందులు ఎప్పుడూ లేదని తెలిపారు. పంటల కొనుగోళ్ల పేరిట కాంగ్రెస్ కార్యకర్తలు రైతుల నుంచి దోపిడీకి పాల్పడ్డారని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ పేరిట రూ.1500 కోట్ల దోపిడీకి కాంగ్రెస్ పాల్పడిందని ఆరోపించారు. అణువణువునా కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. ఈ పంట కాలంలో రైతులకు ఒక్క క్వింటాలుకు కూడా బోనస్ ఇవ్వకుండా బోగస్ చేశారని అన్నారు. ధ్యానం టెండర్ల కుంభకోణంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కడుపు నిండా తినడంతో పాటు ఢిల్లీకి కూడా పంపారని అన్నారు. హైకోర్టులో పిల్ దాఖలు చేస్తే%ో% ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకుండా తప్పించుకుంటోందని మండిపడ్డారు. తప్పు చేయకపోతే ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకుండా 16 వాయిదాలు ఎందుకు తీసుకొందని ప్రశ్నించారు. రైతుల ఉసురు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి తగలక తప్పదని అన్నారు.

## అహ్మదబాద్-లండన్ విమానంలో సాంకేతికి సమస్యలు



న్యూఢిల్లీ,జూన్ 17: దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియాలో వరుస ఘటనలు భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఈ సంస్థకు చెందిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానం ఇటీవల లండన్ వెళ్తుండగా అహ్మదాబాద్‌లో కుప్పకూలిన ఘటన మరవకముందే.. మరిన్ని విమానాల్లో సాంకేతిక లోపాలు బయటపడటం కలవరపెడుతోంది. తాజాగా అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లాల్సిన మరో విమానంలోనూ సాంకేతిక సమస్య ఎదురైంది. టేకాఫ్‌కు ముందే సమస్యను గుర్తించడంతో ఈ సర్వీసును రద్దు చేశారు.ఎయిరిండియా ఏఐ-159 బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం మంగళవారం మధ్యాహ్నం 1.10 గంటలకు అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరాల్సి ఉంది. ఈ క్రమంలోనే విమానంలో తనిఖీలు చేస్తుండగా.. సాంకేతిక సమస్యను గుర్తించారు. దీంతో టేకాఫ్ నిలిపివేసి సర్వీసును రద్దు చేశారు. గత వారం నాటి విమాన ప్రమాదం తర్వాత లండన్‌కు వెళ్లాల్సిన తొలి షెడ్యూల్డ్ విమానం ఇదే కావడం గమనార్హం.జూన్ 12న అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి లండన్ బయల్దేరిన ఏఐ 171 బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం క్షణాల వ్యవధిలోనే కుప్పకూలి దగ్ధమైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో విమానంలోని 241 మంది ప్రాణాలు కోల్పోగా.. ఒకేఒక్క ప్రయాణికుడు మృత్యుంజయుడిగా బయటపడ్డారు. ఇక విమానం నివాస సముదాయంపై పడటంతో మరో 33 మంది మృతి చెందారు. ఈ ఘటన తర్వాత ఎ171గ ÷÷-లట్ నంబర్‌ను ఎయిరిండియా పక్కనబెట్టింది. దాని స్థానంలో ఏఐ 159 నంబరును వినియోగించింది. ఇప్పుడదే సిరీస్ విమానంలో సాంకేతిక సమస్య ఎదురైంది. మరోవైపు, ఈ ఘటన తర్వాత పలు ఎయిరిండియా విమానాల్లో సాంకేతిక లోపాలు గుర్తించిన సంగతి తెలిసిందే. ఈ ఉదయం శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి ముంబయి వెళ్తున్న ఏఐ 180 విమానంలో సమస్య రావడంతో దాన్ని కోల్‌కతాలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులను దించేసి తనిఖీలు చేపట్టారు.

## ఇరాన్ నుంచి 110 మంది భారతీయ విద్యార్థులు తరలింపు



టెహ్రాన్:ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో భారత్ అప్రమత్తం అయింది. భారతీయులను అలర్ట్ చేసింది. తక్షణమే ఖాళీ చేయాలని సూచించింది. ఇందులో భాగంగా 110 మంది భారతీయ విద్యార్థులతో కూడిన మొదటి బ్యాచ్ అర్మేనియం చేరుకుంది. బుధవారం ఉదయం కల్లా ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు తరలించనున్నారు. ఈ మేరకు భారత రాయబార కార్యాలయం ఏర్పాట్లు చేసింది. ఇక సొంత వనరులు కలిగిన వారు కూడా తరలి వెళ్లాలని పేర్కొంది. ఈ మేరకు భారత విదేశాంగశాఖ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇక అత్యవసర పరిస్థితుల్లో భారతీయ పౌరులందరూ వెంటనే రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని కూడా కోరింది. ఎలాంటి అవసరత వచ్చినా ఈ నెంబర్లకు ఫోన్ చేయాలని కోరింది. ం989010144557,ం98 9128109115, ం989128109109 నెంబర్లకు కాల్ చేయాలని తెలిపింది.చైనా, టర్కీ, యూకే వంటి అనేక దేశాలు ఇరాన్-ఇజ్రాయెల్ దేశాలు ఉద్రిక్తతలు తగ్గించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరాయి. ఇక ఆదివారం టెహ్రాన్-వాషింగ్టన్ మధ్య జరగాల్సిన అణు చర్చలు రద్దయ్యాయి.ఇక జీ 7 శిఖరాగ్ర సమావేశంలో ఉన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అర్ధాంతరంగా.. ఆగమేఘాలపై అమెరికాకు వెళ్లిపోయారు. భద్రతా మండలి సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి.ఇదిలా ఉంటే మంగళవారం తెల్లవారుజామున జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీకి అత్యంత సన్నిహితుడు, ఇరాన్ టాప్ కమాండర్ అలీ షాద్మానీ ప్రాణాలు వదిలారు. షాద్మానీ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ , ఇరానియన్ సాయుధ దళాలు రెండింటికీ నాయకత్వం వహించాడని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. మంగళవారం రాత్రి ఇజ్రాయెల్ సైన్యం జరిపిన దాడిలో షాద్మానీ చనిపోయినట్లుగా ఐడీఎఫ్ తెలిపింది. ఇతడు ఖమేనీకి అత్యంత సన్నిహితుడిగా పేర్కొంది. ఖమేనీని చంపితేనే యుద్ధం ఆగుతుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వ్యాఖ్యానించారు. ట్రంప్ అడ్డుపడడంతోనే ఖమేనీ బతికిపోయాడని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఖమేనీ బంకర్‌లో ఉన్నట్లుగా తెలుస్తోంది.

## మోడీ బీసీ అయ్యుండి.. కుల గణన చేయడానికి ఆలోచిస్తున్నారు!



హైదరాబాద్,కుల గణనపై ఎవరు మాట్లాడనప్పుడే రాహుల్ గాంధీ మాట్లాడారు అని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు పేర్కొన్నారు. ఎవరు ఎంతో, వారికి అంత అని చెప్పారు..ఇప్పటి వరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని మూడు సార్లు కలిసి బీసీలకి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఇవ్వు అని కోరినా ఇవ్వలేదు.. జన గణనతో మాకు వచ్చే లాభం లేదు అని తేల్చి చెప్పారు. కుల గణన చేస్తే మాకు మంచిది.. రాహుల్ గాంధీ అగ్రకులంలో పుట్టినా బీసీలకు న్యాయం చేయాలని మాట్లాడారు.. మోడీ బీసీ అయినా, కుల గణన చేయడానికి ఆలోచిస్తున్నాడు అని ఎద్దేవా చేశారు.

## ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు..




నాగపూర్ : కొచ్చి నుంచి ఢిల్లీ మధ్య ప్రయాణిస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. కాల్ వచ్చిన సమయానికి విమానం కొచ్చి నుంచి బయలుదేరింది. దీంతో అప్రమత్తమైన ఫ్లైట్ సిబ్బంది హుటాహుటిన ఫ్లైట్‌ను దగ్గరలో ఉన్న నాగ్‌పూర్ ఎయిర్‌పోర్టు లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. ఫ్లైట్ నుంచి ప్రయాణికులందరినీ దించేసి భద్రతా సిబ్బంది క్షుణంగా తనిఖీలు చేపట్టారు. అందులో ఎటువంటి బాంబులు లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

ధర్మఘంట
తెలుగు దినపత్రిక



సంపాదకీయం

బుధవారం 18-06-2025

# సడలింపుల ప్రభావమెంత?

భారతదేశంలో టెలికం సర్వీస్ ప్రొవైడర్లు వీలైనంత చవగ్గా సేవలు అందించడానికి పోటీపడుతుంటారు. దానివల్ల వచ్చే నష్టాలను భరించడానికి తమను ఆదుకోవాలనీ, బకాయిలను మాఫీ చేయాలనీ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తారు. ఈ ధోరణి వల్ల సర్కారీ ఖజానాకు చిల్లు పడుతోంది. భారతదేశంలో టెలికం సర్వీస్ ప్రొవైడర్లు వీలైనంత చవగ్గా సేవలు అందించడానికి పోటీపడుతుంటారు. దానివల్ల వచ్చే నష్టాలను భరించడానికి తమను ఆదుకోవాలనీ, బకాయిలను మాఫీ చేయాలనీ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తారు. ఈ ధోరణి వల్ల సర్కారీ ఖజానాకు చిల్లు పడుతోంది. స్పెక్ట్రమ్ వినియోగ రుసుములు, లైసెన్సింగ్ ఛార్జీల రూపంలో ప్రభుత్వంతో టెలికం సంస్థలు పంచుకోవాల్సిన ఆదాయ శాతాన్ని 'సర్దుబాటు చేసిన స్థూల రాబడి(ఏజీఆర్)'గా పరిగణిస్తారు. 1999 నుంచి అమలవుతున్న ఈ విధానంలో కేంద్రం మొదట ఏజీఆర్‌ను 15శాతంగా ప్రకటించి, తరవాత దాన్ని ఎనిమిది శాతానికి తగ్గించింది. టెలికం, నాన్-టెలికం ఆదాయాలు రెండింటి నుంచీ ఏజీఆర్‌ను లెక్కించాలని కేంద్ర టెలికమ్యూనికేషన్ల విభాగం మొదట్లో నిర్దేశించింది. కానీ టెలికం సేవల ద్వారా వచ్చిన ఆదాయాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని ఆయా సంస్థలు వాదించాయి. అయితే, 2019లో సుప్రీంకోర్టు ఏజీఆర్‌పై ప్రభుత్వ వైఖరినే సమర్థించి, ఆనాటికి పేరుకున్న రూ.1.47లక్షల కోట్ల ఏజీఆర్ బకాయిలను టెలికం కంపెనీలు తక్షణం చెల్లించాలని ఆదేశించింది. తరవాత టెలికం సర్వీస్ ప్రొవైడర్లు(టీఎస్పీ) చేసుకున్న అప్పీలును మన్నించి, 2020 సెప్టెంబరు మొదలుకుని వరసగా పదేళ్లపాటు విడతలవారీగా ఏజీఆర్ బకాయిలు చెల్లించవచ్చని సుప్రీం తీర్మానించింది. తరవాత కేంద్రం ఏజీఆర్ బకాయిల చెల్లింపుపై నాలుగేళ్ల మారటోరియం విధించింది. ఏదైనా టీఎస్పీ ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలను ఈక్విటీ షేర్ల రూపంలోకి మార్చుకోదలిస్తే, అందుకూ సమ్మతించింది. 2021నాటి టెలికం విధానంలో నాన్-టెలికం సేవలపై ఆదాయాన్ని ఏజీఆర్ నుంచి మినహాయించారు.

బీఎస్ఎన్ఎల్‌పై భారం

టెలికం కంపెనీలకు డిపాజిట్లపై వచ్చే వడ్డీ, స్థిరాస్తి విక్రయాల ద్వారా లభించిన మొత్తాలు, డివిడెండ్ ఆదాయం, మౌలిక వసతులను పంచుకునే కంపెనీల నుంచి వచ్చే ఆదాయాలను నాన్-టెలికం సేవల ద్వారా వచ్చిన రాబడిగా పరిగణిస్తారు. విదేశ మారకద్రవ్య విలువలో మార్పులవల్ల లభించే ఆదాయం, బీమా క్లెయిములు, మారుమూల ప్రాంతాలకు సరసమైన ధరలకు టెలికం సేవలను అందించడానికి ఏర్పడిన 'యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ నిధి నుంచి వచ్చే జమలు, కేంద్ర సమాచార ప్రసారశాఖ నుంచి లైసెన్సు తీసుకుని నిర్వహించిన కార్యకలాపాలపై రాబడిని కూడా నాన్-టెలికం ఆదాయంగానే పరిగణిస్తారు. దీన్ని ఏజీఆర్ నుంచి మినహాయించడం వల్ల టెలికం కంపెనీలకు భారం తగ్గింది. వొడాఫోన్-ఐడియా కోరిన ప్రకారం, ఆ సంస్థ నుంచి రావాల్సిన రూ.16,133 కోట్ల వడ్డీ బకాయిలను భారత ప్రభుత్వం 2023 ఫిబ్రవరిలో ఈక్విటీ వాటాల రూపంలోకి మార్చింది. తద్వారా షేరు ఒక్కింటికి 10రూపాయల ముఖ విలువపై ప్రభుత్వానికి 22.6శాతం వాటా లభించింది. మళ్లీ ఈ ఏడాది ఏప్రిల్‌లో కేంద్రం రూ.36,950 కోట్ల విలువైన షేర్లను సేకరించింది. దీంతో వొడాఫోన్-ఐడియా సంస్థలో కేంద్రానికి 48.99శాతం వాటా సమకూరింది.

ఈ సంస్థ షేర్లను రూ.10 చొప్పున సేకరించినప్పుడు వొడాఫోన్ షేర్ మార్కెట్ విలువ రూ.7-8 మధ్యనే తచ్చాడింది. అయినాసరే, వొడాఫోన్ తాను చెల్లించాల్సిన రూ.42వేల కోట్ల వడ్డీ, జరిమానాల బకాయిని ప్రభుత్వం రద్దుచేయడం లేదంటూ సుప్రీంకోర్టుకు ఎక్కింది! ఆ అప్పీలును సుప్రీంకోర్టు గతనెలలో కొట్టేసింది. నేడు ఆ కంపెనీ నికర రుణభారం రూ.2.2లక్షల కోట్లకు చేరింది. ఇకపై వొడాఫోన్ బకాయిలను ఈక్విటీగా మార్చే ప్రసక్తి లేదని కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పష్టం చేశారు. భారతీయ టెలికం మార్కెట్‌లో కొన్ని సంస్థలు గుత్తాధిపత్యాన్ని చలాయించే పరిస్థితిని నివారించాలనే ఉద్దేశంతో కేంద్రం మొదటి నుంచీ వొడాఫోన్-ఐడియా పట్ల సడలింపు వైఖరిని అనుసరిస్తూ వచ్చింది. ప్రపంచంలో టెలికం సుంకాలు అతి తక్కువగా ఉన్న దేశాల్లో భారత్ ఒకటి. అతి సంపన్న దేశమైన లగ్జెంబర్గ్‌లో ఒక జీబీ డేటా ధర 1.60 డాలర్లు. దక్షిణ కొరియాలో అది 5.01, అమెరికాలో 6, చైనాలో 0.41 డాలర్లు కాగా, ఇండియాలో కేవలం 0.17 డాలర్లే! ప్రజలకు తక్కువ ధరకే డేటా, కాల్ సౌకర్యాలు లభించడం ఆనందించాల్సిన పరిణామమే అయినా, ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌కు అది భారంగా పరిణమించింది. టెలికం సేవల ఆధునికీకరణలో ఈ సంస్థ వెనకబడింది. ఎయిర్‌టెల్ 2014లోనే 4జీ సేవలను ప్రారంభించగా, రిలయన్స్ జియో 2016లో, వొడాఫోన్-ఐడియా 2019లో వాటిని మొదలుపెట్టాయి. బీఎస్ఎన్ఎల్ ఇప్పటికీ దేశమంతటా 4జీ సేవలను అందించలేకపోతోంది.

అందరికీ అవకాశాలేవీ?

ఏదిఏమైనా బీఎస్ఎన్ఎల్ 18 ఏళ్ల తరవాత తొలిసారిగా 2024-25లో నికర లాభం ఆర్జించింది. మూడో త్రైమాసికంలో రూ.262 కోట్లు, నాలుగో త్రైమాసికంలో రూ.280 కోట్ల నికర లాభాన్ని కళ్లజూసింది. దాంతో నిరుడు రూ.5,370 కోట్లుగా ఉన్న బీఎస్ఎన్ఎల్ నష్టాలు ఈ ఏడాది రూ.2,247 కోట్లకు తగ్గాయి. మొత్తం ఆదాయం రూ.23,487 కోట్లకు చేరింది. భారత్‌లో ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలు ప్రారంభించడం కోసం ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్ లింక్ సంస్థకు కేంద్రం ఇటీవలే అనుమతిచ్చింది. ఈ తరహా లైసెన్సును ఎయిర్‌టెల్ వారి యూటెల్ శాట్‌వన్ వెబ్ సంస్థకు, జియో శాటిలైట్ కమ్యూనికేషన్ సంస్థకు ఇంతకుముందే మంజూరు చేసింది. ఉపగ్రహ కమ్యూనికేషన్ సంస్థలకు వేలం పద్ధతిలో కాకుండా ప్రభుత్వమే స్వయంగా స్పెక్ట్రమ్‌ను కేటాయించడంపైనా, నాలుగు శాతం ఏజీఆర్‌ను లైసెన్సు ఫీజుగా నిర్ణయించడంపైనా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. స్టార్‌లింక్ ఉపగ్రహ సేవలను దేశమంతటికీ విస్తరిస్తే స్వదేశీ టెలికం సంస్థల గతేమిటన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కేంద్రం అంతర్జాతీయ టెలికం సేవలు, వాటి ఛార్జీలను అధ్యయనం చేసి ప్రభుత్వానికీ, ప్రజలకూ ఉభయతారకంగా ఉండే విధానాన్ని చేపట్టాలి. బీఎస్ఎన్ఎల్, వొడాఫోన్ సంస్థలు కూడా మార్కెట్‌లో నిలబడగలిగేలా దన్ను ఇవ్వాలి. ఏవో కొన్ని సంస్థల చేతుల్లో భారతీయ టెలికం మార్కెట్ చిక్కుకుపోకుండా చూడాలి.

# గద్దర్ ఫిల్మ్స్ అవార్డు ఫంక్షన్‌లో తెలంగాణ సోయి ఏది?



హైదరాబాద్, తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ కార్యక్రమం అనేది తెలంగాణ రాష్ట్ర సినిమా కళాకారుల కార్యక్రమం. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తరువాత తొలిసారి జరిగిన సినిమా మహోత్సవం ఇది. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రాంత కళాకారులు హాజరుకావడాన్ని, అవార్డులు స్వీకరించడాన్ని ఎవరూ తప్పు పట్టడం లేదు. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్ర కళాకారులను ఆకాశానికి ఎత్తినందుకు ఎవరూ వేలెత్తి చూపడం లేదు కానీ, తెలంగాణ మట్టిపై పుట్టి జాతీయ, అంతర్జాతీయ కళాకారులుగా పేరొందిన వారి పేర్లను స్మరించకుండా విస్మరించడంపై కళామతల్లి ముద్దుబిడ్డల గుండెలను పిండేస్తున్నది. రేవంత్ రెడ్డి ఆ పేర్లను మర్చిపోయారా? లేక ఆయనకు ఆ స్పీచ్ రాసిచ్చినవారికి ఆ సోయి లేదా? అని తెలంగాణ కవులు, కళాకారులు చర్చించుకుంటున్నారు. మాదాపూర్ హైటెక్స్‌లో శనివారం రాత్రి తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్సు 2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథి హాజరు కాగా, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో పాటు సినిమా రంగానికి చెందిన పలువురు ప్రముఖ నటులు, దర్శకులు, నిర్మాతలు హాజరయ్యారు. వివిధ రంగాలలో ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులను బహూకరించారు. ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డు, రఘుపతి వెంకయ్య పురస్కారం, బీఎన్.రెడ్డి పురస్కారం, నాగిరెడ్డి చక్రపాణి ఫిల్మ్ అవార్డు, కాంతారావు, పైడి జయరాజ్ అవార్డులతో పాటు ఉత్తమ నటుడు, ఉత్తమ నటి సహా వివిధ క్యాటగిరీల్లో పురస్కారాలను కూడా ప్రదానం చేశారు. ఇందులో కాంతారావు ఫిల్మ్ అవార్డు, పైడి జైరాజ్ అవార్డులు పూర్తిగా తెలంగాణ కళాకారుల పేర్లతో ఉన్నవి. మిగతా ప్రత్యేక అవార్డులు మొత్తం ఆంధ్రా ప్రాంతానికి చెందినవని తెలంగాణ ప్రాంత సినీ కళాకారులు చెబుతున్నారు. అన్నింటికి మించి ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. సినిమా పరిశ్రమలో తొలి తరం అంటే ఎన్టీఆర్, ఏఎన్నాఆర్, రెండో తరంలో ఘట్టమనేని కృష్ణ, శోభన్ బాబు, కృష్ణంరాజు, మూడో తరంలో కొణిదెల చిరంజీవి, నందమూరి బాలకృష్ణ, దగ్గుబాటి వెంకటేష్, అక్కినేని నాగార్జున వంటి హీరోలు ఉన్నారన్న రేవంత్‌రెడ్డి.. ప్రస్తుతం నాలుగో తరంలో కొణిదెల పవన్ కళ్యాణ్, ఘట్టమనేని మహేష్ బాబు, అల్లు అర్జున్ ఉన్నారని గుర్తు చేశారు. డైరెక్టర్ రాజమౌళి ప్రపంచం గుర్తించేలా సినిమాలను తీస్తున్నారు కాని హాలీవుడ్, బాలీవుడ్‌ను తెలంగాణ గడ్డకు తీసుకురావడం లేదని చెబుతూ.. వారు కూడా ఇక్కడకు రావాలంటే అందుకోసం మీకేమి కావాలో చెబితే ఆ దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇంతటి ప్రసంగంలోనూ ముఖ్యమంత్రి ఎక్కడా తెలంగాణ సోయి ఉన్నట్టు మాట్లాడకపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. తెలంగాణ మట్టిగడ్డపై పుట్టి చెన్నై, హైదరాబాద్, ముంబైలలో సినిమా రంగానికి సేవ చేసి, ప్రఖ్యాతి పొందిన కళాకారుల పేర్లను ప్రస్తావించకపోవడం తెలంగాణ సమాజం జీర్ణించుకోలేకపోతున్నది.

తెలంగాణ కళాకారులకు గౌరవమేది?

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత తెలంగాణ సమగ్ర సాంస్కృతిక విధానం రూపొందించే ఆలోచనతో.. ప్రముఖ దర్శకుడు, మెతుకుసీమ వాసి, రచయిత బీ నరసింగరావుతో సాంస్కృతిక పాలసీని తయారు చేయించారు. పాలసీలో ప్రస్తావించిన అంశాల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా రేవంత్ రెడ్డి తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్సులో ప్రస్తావించలేదంటున్నారు తెలంగాణ ప్రాంత సినీ కళాకారులు.

దేశ విదేశాల్లో ఖ్యాతిగాంచిన శ్యాంబెనెగల్

ఈ గడ్డపై పుట్టి దేశ, విదేశాలలో పేరు ప్రఖ్యాతులు పొందిన వారిలో భారతీయ సినిమా దర్శకుడు, దాదా సాహెబ్ ఫాల్కే పురస్కార గ్రహీత, పద్మశ్రీ శ్యాం బెనెగల్ 1934 సంవత్సరంలో హైదరాబాద్ నగరం తిరుమలగిరిలో జన్మించారు. ఆయన పూర్తి పేరు శ్యాం సుందర్ బెనగల్. సికిందరాబాద్ ప్యాట్నీ సెంటర్ లోని మహబూబ్ కాలేజీలో డిగ్రీ వరకు చదువుకుని, ఆ తరువాత ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో మాస్టర్ పట్టా అందుకున్నారు. ఆయన సినిమా రంగానికి చేసిన కృషిని భారత ప్రభుత్వం గుర్తించింది కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించ లేదని ఈ ప్రాంత కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాలీవుడ్ హీరో పైడి జైరాజ్

సిరిసిల్లలో అచ్యుతయ్య నాయుడు, తాయారమ్మ దంపతులకు జన్మించిన పైడి జైరాజ్ హిందీ చిత్ర పరిశ్రమలో గొప్ప నటుడిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. భారతీయ చలన చిత్ర రంగానికి ఆయన చేసిన సేవలకు గాను 1980లోనే దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు వరించింది. 156 చిత్రాలో కథానాయకుడి పాత్రలతో పాటు మొత్తం 300కు పైగా మూకీ, టాకీ సినిమాలలో నటించారు. నిజాం కాలేజీలో చదువుకున్న జైరాజ్ సినిమాలపై మోజుతో 1929లోనే ముంబై చేరుకుని, శాంతారాం, పృథ్వీరాజ్ కపూర్ స్థాయిలో పేరు తెచ్చుకున్నారు. నిరూపా రాయ్, శశికళ, దేవికారాణి, మీనాకుమారి వంటి నటీమణుల సరసన నటించి మెప్పించారు. హిందీలోనే కాకుండా మరాఠా, ఒడియా, బెంగాలీ, పంజాబీ, కొంకణి, గుజరాతీ, మలయాళం భాషల్లో నటించి, తెలంగాణ నేల నుంచి దేశం గర్వించదగ్గ స్థాయికి ఎదిగారు.

సినీ కళామతల్లికి సిందూరం కాంతారావు

తాడేపల్లి లక్ష్మీకాంతారావు 1923 సంవత్సరం సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గుడిబండ గ్రామంలో జన్మించి, అనేక సాంఘిక, పౌరాణిక, జానపద పాత్రలు చేశారు. మొత్తం 400కు పైగా సినిమాలలో నటించిన ఈయన నిర్దోషి చిత్రం ద్వారా సినిమాల్లోకి ప్రవేశించారు. దర్శకులు దాసరి నారాయణ రావు మాటల్లో చెప్పాలంటే తెలుగు చలనచిత్ర సీమకు ఎన్టీఆర్, ఏఎన్నాఆర్ రెండు కళ్లు అయితే వాటి మధ్య నుదుటిపై తిలకం కాంతారావు.

పేద కళాకారుల కోసం తపించిన ప్రభాకర్‌రెడ్డి

తెలుగు సినిమా పరిశ్రమను చెన్నై నుంచి 1990 మొదట్లో హైదరాబాద్ కు తీసుకురావడంలో సినిమా నటుడు, రచయిత, వైద్యుడు మందాడి ప్రభాకర్ రెడ్డి పాత్ర చెరిపేయలేనిది. పేద సినిమా కళాకారుల కోసం చిత్రపురిలో తన 10 ఎకరాల భూమిని ఉచితంగా ఇచ్చారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో లక్ష్మారెడ్డి, కౌసల్య దంపతులకు 1935లో ప్రభాకర్ రెడ్డి జన్మించారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ నుంచి ఎంబీబీఎస్ పూర్తి చేసి 1960 లో చివరకు మిగిలేది సినిమాతో చిత్రరంగంలోకి ప్రవేశించారు. ఆయన తన 37 సంవత్సరాల సినిమా కేరీర్ లో 472 సినిమాలలో నటించి ప్రేక్షకులను మెప్పించారు.

విలక్షణ దర్శకుడు నరసింగరావు

ప్రపంచ చలనచిత్ర పటంపై తెలంగాణ సినిమాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన దర్శకులు, రచయిత బొంగు నరసింగరావు. సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ గ్రామంలో 1946లో జన్మించిన ఆయన రంగుల కల, దాసి, మట్టి మనుషులు నిర్మాణం చేసి తెలంగాణ జీవన చిత్రాలనే తన సినిమాలుగా రూపొందించిన గొప్ప కళాకారుడు. మా భూమి సినిమాను 1979లోనే కైరో, సిడ్నీ ఫిల్మ్ ఫెస్టివల్, కార్లోవీ ఫిల్మ్ ఫెస్టివల్ లో ప్రదర్శింపచేయించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. నరసింగరావు తీసిన ప్రతి సినిమా తెలంగాణ సినిమాకు ఒక గ్రామర్, బలమైన పునాదిని సృష్టించిందని ఇప్పటికీ చెప్పుకొంటారు. మట్టి మనుషులు మాస్కో అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ లో మెరిట్ అవార్డు డిప్లొమా, మా ఊరు హంగేరిలో అంతర్జాతీయ ఉత్సవంలో మీడియా వేవ్ అవార్డును గెలుపొందింది.

క్లార్క్ గేబుల్ ఆఫ్ ఇండియా అజిత్

బాలీవుడ్‌లో క్లార్క్ గేబుల్ ను తలపించే అజిత్‌ఖాన్.. మన హైదరాబాద్ బిడ్డే. హిందీ సినిమారంగంలో దాదాపు నాలుగు దశాబ్దాలపాటు రెండు వందలకు పైగా సినిమాల్లో నటించాడు. గోల్కొండ కోట సమీపంలోని దక్కనీ ముస్లిం కుటుంబంలో హమీద్ అలీ ఖాన్‌గా జన్మించిన అజిత్.. పాఠశాల వయసులోనే సినిమా హీరోగా తోటి విద్యార్థులు ప్రశంసించేవారు. డబ్బులు లేకపోవడంతో పాఠ్యపుస్తకాలను అమ్మేసి, తల్లిదండ్రులకు చెప్పకుండా ముంబై వెళ్ళాడు. 1940ల్లో అదృష్టం అతనికి అనుకూలించలేదు. మొదట్లో చిన్నాచితక క్యారెక్టర్లు వేశాడు. 1946లో తొలిసారిగా షాహే మిశ్రా సినిమాలో గీతా బోస్ పక్కన నటించాడు. ఆ తర్వాత ప్రధాన నటుడిగా స్థిరపడ్డాడు. నానా భాయ్ భట్ సలహా మేరకు "అజిత్" అనే పేరును తన స్క్రీన్-నేమ్‌గా పెట్టుకున్నాడని చెబుతారు. టీ కృష్ణ, శంకర్ జైకిషన్ జంటలో శంకర్, విలనిజానికి తొలి ప్రతినిధి ఆర్ నాగేశ్వర్‌రావు, త్యాగరాజు ఇలా ఎందరో ఆయా తరాల్లో తెలుగు సినీ తెరను కళకళలాడించారు. అనేక మంది సాంకేతిక నిపుణులు తమ సత్తా చాటుకున్నారు. వీరందరినీ విస్మరించడం మనల్ని మనం అవమానపర్చుకోవడమేనని తెలంగాణ సినీ కళాకారులు చెబుతున్నారు.

తెలంగాణ పాలసీ ఏది?

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావం తరువాత బీఆర్ఎస్ పాలనలో సమగ్ర సాంస్కృతిక విధానాన్ని రూపొందించడంలో విఫలమైంది. అవార్డులను బహూకరించేందుకు పాలసీ రూపొందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించింది.

# పవనశక్తిని ఒడిసిపట్టాలి



న్యూఢిల్లీ,ప్రపంచ పవన శక్తి సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏట 15 జూన్ రోజున ప్రపంచ పవన దినం లేదా వరల్డ్/గ్లోబల్ విండ్ డే నిర్వహిస్తూ యువత, పౌర సమాజానికి పర్యావరణ హితమైన పవన శక్తి ప్రాధాన్యాలను, దాని ప్రయోజనాలను వివరించుట జరుగుతుంది. సంప్రదాయేతర తరగని పునరుత్పత్తి చేయగల శక్తి వనరుల్లో సౌరశక్తి తర్వాత రెండవ ప్రధానమైనదిగా పవన శక్తికి గుర్తింపు ఉన్నది. శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గిస్తూ, పర్యావరణహిత శక్తిని ఉత్పత్తి చేయడానికి దేశవ్యాప్తంగా సహజంగా వీస్తున్న పవనాల్లో దాగిన అపార శక్తిని విద్యుచ్ఛక్తిగా మార్చడానికి ట్బన్లను వినియోగిస్తారు. ఈ ట్బన్లు గవీస్తున్న గాలిలో దాగిన గతిశక్తిని యాంత్రిక శక్తిగా మార్చడం, తర్వాత విద్యుచ్ఛక్తిగా మార్చడం జరుగుతోంది. ఆన్షోర్, ఆఫ్షోర్ పవన శక్తులను ఒడిసిపట్టి, ఆరోగ్యకర పనరుత్పత్తి శక్తిని ఉత్పత్తినచేయడం నేటి కనీస అవసరంగా మారుతోంది. ప్రపంచ దేశాల్లో చైనా, యూఎస్, జర్మనీ, భారత్ లాంటి దేశాలు పవన శక్తి వినియోగంలో ముందున్నాయి. యూరోప్లో వినియోగిస్తున్న మొత్తం శక్తిలో 20 శాతం పవన శక్తి ఉండడం హర్షదాయకం. తీరప్రాంతాలు, గాలి వీచే మైదాన ప్రాంతాలు అధికంగా ఉన్న భారత్ నాలుగవ అతి పెద్ద పవన శక్తి ఉత్పత్తి చేస్తున్న భారతంలో గుజరాత్, తమిళ నాడు, కర్నాటక, రాజస్థాన్ రాష్ట్రాలు పవన శక్తి పరిశ్రమలో ముందు ఉన్నాయి. తెలంగాణలో దాదాపు 130 మెగావాట్లకు పైగా పవనశక్తి ఉత్పత్తి కావడం, రానున్న రోజుల్లో మరింత పెంచే ప్రయత్నాలు చేయడం జరుగుతోంది. దేశ పవన శక్తిలో 40 శాతం వరకు తమిళ నాడు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నది. 2025 తొలి త్రైమాసికంలో 50,000 మెగావాట్ల పవనశక్తి ఉత్పత్తికి నిర్మాణాలు జరిగాయి. కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించడానికి ప్రత్యామ్నాయంగా పునరుత్పత్తి పవన శక్తిని ఒడిసిపట్టడం మన తక్షణ కర్తవ్యం అని భావించాలి. ప్రపంచ పవన దినోత్సవ వేదికగా (%ఖుఅఎ్తుజుఖు ఖుఎ ఖీవర్అఖుశ్రీ ఎవఅబవ%) పవన శక్తి పట్ల అవగాహన, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక ప్రగతికి దోహదపడడం, పవనాల నుంచి చవకైన విద్యుచ్ఛక్తిని తయారు చేయడం, పవన శక్తి వినియోగం పట్ల ప్రభుత్వ పాలసీలు రచించడం/అమలు చేయడం జరుగుతుంది. నేడు ప్రపంచవ్యాప్తంగా పవనశక్తి రంగంలో 3.7 లక్షల ఉద్యోగులు పని చేస్తుండగా, 2030 నాటికి వీరి సంఖ్య 6 లక్షలకు పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. పవనశక్తి ఉత్పత్తిని క్రమంగా పెంచడానికి పలు దేశాలు కార్యాచరణను సిద్ధం చే యడం, అధిక ప్రాధాన్యం ఇవ్వడం కొనసాగుతున్నది. గృహాల్లో వెలుగు లు నింపడం, పరిశ్రమల్లో యంత్రా లు కదలడానికి పవనశక్తిని వినియోగిస్తున్నాం. కొండలు, పర్వతాలు, స ముద్రాలు, తీరప్రాంతాల్లో పవనశక్తిని ఒడిసిపట్ట వచ్చని గమనించాలి. పవనశక్తి ప్రాధాన్యాన్ని గుర్తించి, ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తూ, సుస్థిరాభివృద్ధికి ఊతం ఇవ్వాలి. నేడు ప్రపంచాన్ని కుదిపేస్తున్న వాతావరణ ప్రతికూల మార్పులను కట్టడి చేయడానికి తరగని శక్తి వనరులను ఆశ్రయించాల్సిందే. పవనశక్తి ఉత్పత్తికి అనుకూలంగా ఉన్న భారతం రానున్న రోజుల్లో పవనశక్తి ఉత్పత్తిని పెంచుతూ ప్రపంచ పవనశక్తి దేశంగా పేరు తెచ్చుకోవాలి, పర్యావరణాన్ని పరిరక్షిణచుకోవాలి. భవిష్యత్తు శక్తి భద్రతలో పవనశక్తి పాత్ర విశిష్టమైనదని తెలుసుకోవాలి. మెయింటెనెన్స్ ఖర్చులు అతి తక్కువగా ఉన్న పవనశక్తి రంగం రానున్న రోజుల్లో మన దేశంలో మరింత పుంజుకోవాలని కోరుకుందాం

# పబ్‌లపై ఎస్‌వోటీ పోలీసుల దాడులు

హైదరాబాద్, తెలంగాణను డ్రగ్ రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా పోలీసులు మెరుపుదాడులు చేస్తున్నారు. తాజాగా కోకాపేట్‌లోని పబ్‌లో అకస్మాత్తుగా తనిఖీలు చేపట్టారు ఎస్వోటీ పోలీసులు. డ్రగ్స్, గంజాయి వాడుతున్నట్లు సమాచారంతో ఎస్ఓటీ, నార్సింగి పోలీసులు సంయుక్తంగా పబ్‌లలో దాడులు నిర్వహించారు. కోకాపేటలోని రాబిట్ హెూల్, మై క్యాప్స్, గండిపేటలోని టస్కా పబ్‌లలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో అనుమానితులకు డ్రగ్స్ డిటెక్షన్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇద్దరికి గంజాయి పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది. దీంతో నార్సింగ్ పోలీసులు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇటీవల గచ్చిబౌలిలోని పలు పబ్బులపై కూడా ఎస్ఓటీ పోలీసులు దాడులు చేసిన విషయం తెలిసిందే. ఎస్ఎల్ఎన్ టెర్మినల్ మాల్‌లోని పబ్బుల్లో డ్రగ్స్ తనిఖీలు నిర్వహించారు. క్లబ్ రోగ్, ఫ్రాట్ హౌస్ పబ్‌లో దాడులు జరిపిన ఎస్వోటీ పోలీసులు.. డ్రగ్స్ టెస్ట్‌లు నిర్వహించారు. ఈ క్రమంలో మొత్తం నలుగురికి గంజాయి పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది. గంజాయి పాజిటివ్ వచ్చిన వారిలో ఫ్రాట్ హౌస్ పబ్ డీజే ప్లేయర్ శివ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే మాదాపూర్, కొండాపూర్‌లో పలు పబ్‌లపై జరిపిన దాడుల్లోనూ డ్రగ్స్ టెస్టులు నిర్వహించగా.. ఇద్దరికి గంజాయి పాజిటివ్ అని తేలింది. మాదాపూర్ అఖాన్ పబ్‌లో ఒకరికి, కొండాపూర్ ఏ19 పబ్‌లో మరొకరికి గంజాయ్ పాజిటివ్ అని తేలడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇక.. తెలంగాణను డ్రగ్స్ భూతం పట్టిపీడిస్తోంది. డ్రగ్స్‌తో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ యువత మాత్రం డ్రగ్స్ బారి నుంచి బయటకురాని పరిస్థితి. డ్రగ్స్ ఊబిలో చిక్కుకుని విలువైన జీవితాన్ని, భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేస్తోంది యువత. మరోవైపు విద్యార్థులు, యువతే లక్ష్యంగా డ్రగ్స్ మాఫియా ఈ దందాను నిర్వహిస్తోంది. సామాన్యుల నుంచి సెలబ్రెటీల వరకు కూడా డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడుతున్న సందర్భాలు ఎన్నో. సెలబ్రెటీలను కూడా వదలకుండా పోలీసులు పట్టుకుంటున్నారు. అంతేకాకుండా రెస్టారెంట్లు, పబ్‌లు, హెటల్స్‌లలో తరచూ దాడులు చేస్తూ డ్రగ్స్ మాఫియా ఆగడాలను అరికట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ ఎక్కడో చోట డ్రగ్స్, గంజాయి సరఫరా కొనసాగుతూనే ఉంది.

## విచారణ చేపట్టిన అధికారులు

హైదరాబాద్,జర్మనీ నుంచి హైదరాబాద్ వస్తున్న లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. లుఫ్తాన్సా ఎల్‌హెచ్ 752 విమానానికి ఈ బెదిరింపు కాల్ రావడంతో శంషాబాద్ విమానాశ్రయంలో ఫైలట్ ల్యాండ్ చేయలేదు. విమానం తిరిగి జర్మ నీకి ప్రయాణమైంది. కాగా శంషాబాద్ ఎయిర్ పోర్టుకు రావాల్సిన విమానం తిరిగి ఫ్రాంక్‌ఫర్ట్ విమానాశ్రయానికి వెళ్లింది. దీంతో జర్మనీ పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ సాగిస్తున్నారు. జర్మనీ నుంచి బయలుదేరిన విమానం దాదాపు 8, 9 గంటల తర్వాత శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకోవాల్సి ఉంది. విమానంలో ఎక్కువ మంది హైదరాబాద్‌కు చెందిన ప్రయాణికులు ఉన్నారు. అలాగే ముంబైకు చెందిన వారు కూడా ఉన్నారు. అయితే బాంబు బెదిరింపు కారణంతో లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ విమానం తిరిగి ఫ్రాంక్‌ఫర్ట్‌కు వెళ్లింది. అక్కడ ఎయిర్ పోర్టు అధికారులు పరిశీలించిన తర్వాత బాంబు లేదని తేల్చారు. అదొక ఫేక్ కాల్‌గా గుర్తించారు. అయినా మరో 2, 3 గంటలు విమానాన్ని పూర్తిగా తనిఖీలు చేసిన తర్వాత బయలుదేరే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విమానాశ్రయంలోనే ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. జర్మనీ నుంచి బయలుదేరిన సుమారు రెండు గంటల ప్రయాణం అనంతరం విమానానికి బాంబు బెదిరింపు కాల్ రావడంతో ఫైలట్ తిరిగి ఫ్లైట్‌ను ఫ్రాంక్‌ఫర్ట్‌కు మళ్లించారు. అనంతరం అధికారులు విమానాన్ని ఆధీనంలోకి తీసుకొని భద్రత చర్యలు చేపట్టారు. ఎల్‌హెచ్ 752 విమానం జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్‌పోర్టు నుంచి అక్కడి కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం 2.14 గంటలకు బయలుదేరింది. షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆదివారం అర్ధరాత్రి దాటాక చేరుకోవాల్సి ఉంది. అయితే బాంబు బెదిరింపు కారణంగా విమానాన్ని వెనక్కి మళ్లించారు. హైదరాబాద్‌లో విమానం ల్యాండింగ్‌కు అనుమతి రాకపోవడంతోనే ఫ్లైట్‌ను వెనక్కి మళ్లించినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రయాణికులకు విమానాశ్రయంలోనే వసతి కల్పించినట్లు తెలియవచ్చింది.

# రీయూనియన్ మొదలైనట్టే!

హైదరాబాద్,తెలుగు దేశం పార్టీతెలుగు ప్రజల ఆత్మ గౌరవ పరిరక్షణే పరమావధిగా ఏర్పాటైన పార్టీ. 40 ఏళ్లకు పైగా ప్రస్థానం సాగిస్తున్న టీడీపీ అన్ని సమయాల్లో కంటే ఇప్పుడు అత్యంత బలీయంగా ఉందని చెప్పాలి. జనసేన, బీజేపీలతో జత కట్టిన టీడీపీ%ఔ% ఏపీ అసెంబ్లీని దాదాపుగా క్లీన్ స్వీప్ చేసినంత పనిచేసింది. తిరుగులేని విజయాన్ని నమోదు చేసిన టీడీపీ.. అటు కేంద్రంలోని ఎన్డీఏలో కీలక భాగస్వామిగా కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ ఆవిర్భవించిన తెలంగాణలో తిరిగి పార్టీకి పూర్వవైభవం కల్పించే దిశగా పార్టీ అదినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు చర్యలు ప్రారంబించేశారు. గత కొంతకాలం క్రితమే చంద్రబాబు ప్రారంభించిన ఈ చర్యలు క్రమంగా సఫలం అవుతున్నాయి. గతంలో టీడీపీలో కీలక నేతగా పనిచేసిన నల్లగొండ కీలక రాజకీయవేత్త, కేంద్ర మాజీ మంత్రి గుత్తా సుఖేందర్ రెడ్డి శనివారం హైదరాబాద్ లో చంద్రబాబుతో బేటీ అయ్యారు. ఏపీ సీఎంగా బిజీబిజీగా ఉంటున్న చంద్రబాబు%ఔ% వీకెండ్స్ లో ఫ్యామిలీతో గడిపేందుకు హైదరాబాద్ వస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే శనివారం హైదరాబాద్ చేరిన బాబుతో గుత్తా భేటీ అయ్యారు. వీరి భేటీలో ఏఏ అంశాలు చర్చకు వచ్చాయన్న విషయాన్ని పక్కనపెడితే%ఔ% టీ టీడీపీ రీయూనియన్ దిశగా పకడ్బందీగానే అడుగులు పడుతున్నాయని చెప్పక తప్పదు. ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్ చాలా వీక్ గా ఉంది. పదేళ్ల పాటు తెలంగాణ ప్రజలు ఇచ్చిన అదికారాన్ని దుర్వినియోగం చేసిందంటూ ఇంటా బయటా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన కీలక పరిణామాలపై వరుసగా కేసులు నమోదు అవుతున్నాయి. కేసీఆర్ సహా బీఆర్ఎస్ కు చెందిన చాలా మంది నేతలు ఈ విచారణలు, కేసుల్లో ఇరుక్కుని నానా అవస్థలు పడుతున్నారు. ఇక అధికారంలో ఉన్న కాంగ్రెస్%ఔ% అంతగా బలంగా లేదనే చెప్పాలి. అదికారం ఉంది కదా అన్న ధీమా తప్పించి వచ్చే ఎన్నికల్లో గెలిచి తీరతారమన్న నమ్మకం అయితే ఆ పార్టీ నేతల్లో పెద్దగా కనిపించడం లేదు. ఇదిలా ఉంటే ఇప్పుడున్న కాంగ్రెస్ కేబినెట్ లో సీఎం రేవంత్ రెడ్డితో సహా ఇద్దరు కీలక మంత్రులు టీడీపీ నుంచి వచ్చిన వారే. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క టీడీపీ నుంచి కాంగ్రెస్ లోకి వచ్చిన నేతలే. రాష్ట్ర విభజన నేపథ్యంలో వీరు పార్టీ మారక తప్పలేదు. ఇక ప్రభుత్వ సలహాదారుగా ఉన్న వేం నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ లో ఒకింత ఇనాక్టివ్ గా ఉన్న మండవ వెంకటేశ్వరరావు, మాజీ మంత్రులు దేవేందర్ గౌడ్ కుమారులు, నాగం జనార్ధన్ రెడ్డి కుమారుడు, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాసరెడ్డి తదితరులు బాబు ఇలా పిలిస్తే అలా టీడీపీలోకి వచ్చి యాక్టివ్ అయ్యేందుకు సదా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ లెక్కన 2028 చివరలో జరగనున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టీ టీడీపీ సత్తా చాటడం ఖాయమేనన్న విశ్లేషణలు సాగుతున్నాయి.

# యువతిపై చేయి చేసుకున్న ర్యాపిడో రైడర్

బెంగళూరు, ర్యాపిడో బైక్ డ్రైవర్ ఓ యువతిపై చేయి చేసుకున్న సంఘటన సోమవారం కర్ణాటక రాజధాని బెంగళూరు నగరంలో చోటుచేసుకుంది. ర్యాపిడో బైక్ రైడర్ ఓ అమ్మాయిపై చేయి చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ర్యాపిడో, ఊబర్, ఓలా వంటి సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. ఆన్‌లైన్‌లో రైడ్ బుక్ చేసుకుని ఈజీగా గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు ఎక్కువగా వీటిపైనే ఆధారపడి ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో బెంగళూరులో ఓ యువతి ర్యాపిడో బైక్ రైడ్ బుక్ చేసుకుంది. ఈ క్రమంలో ఆమెకు చేదు అనుభవం ఎదురైంది. ర్యాపిడో బైక్ డ్రైవర్ ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంప్ చేశాడు. దీంతో ఆమె రైడ్‌ను మధ్యలోనే ఆపి కిందకు దిగింది. ర్యాష్ డ్రైవింగ్‌పై అతడిని ప్రశ్నించింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన బైక్ డ్రైవర్.. ఆ యువతిపై చేయి చేసుకున్నాడు. రోడ్డుపైనే యువతి చెంప ఛెళ్లుమనిపించాడు. దీంతో ఆమె ఒక్కసారిగా కింద పడిపోయింది. అక్కడున్న స్థానికులు ఈ తతంగాన్నంతా చూస్తున్నారు తప్పితే ఆపే ప్రయత్నం చేయలేదు. ఈ నెల జూన్ 14న జయనగర్ ప్రాంతంలో చోటు చేసుకున్న ఈ ఘటన తాజాగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సంఘటన పై బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## లేడీ డాన్..గ్యాస్ స్టేషన్ సిబ్బందిపై గన్‌తో గురిపెట్టిన మహిళ

లక్నో, గ్యాస్ స్టేషన్ సిబ్బందితో ఒక కుటుంబం వాగ్వాదానికి దిగింది. ఈ నేపథ్యంలో ఆ కుటుంబానికి చెందిన మహిళ గ్యాస్ స్టేషన్ వ్యక్తి ఛాతిపై గన్ గురిపెట్టింది. నీ కుటుంబం గుర్తుపట్టలేనంతగా బుల్లెట్లతో కాల్చేస్తానని బెదిరించింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని హర్డోయ్‌లో ఈ సంఘటన జరిగింది. ఆదివారం సాయంత్రం ఒక కుటుంబం కారులో సీఎన్‌జీ రీఫిల్ కోసం గ్యాస్ స్టేషన్‌కు చేరుకున్నది. కాగా, సీఎన్‌జీ ఫిల్ చేస్తున్న సిబ్బంది భద్రత దృష్ట్యా కారులో ఉన్న వారిని బయటకు రావాలని సూచించాడు. అయితే కారు దిగిన ఎహ్‌సాన్ ఖాన్, గ్యాస్ స్టేషన్ సిబ్బంది రజనీష్ కుమార్‌తో వాగ్వాదానికి దిగాడు. మీదకు వెళ్లడంతో ఆ వ్యక్తి చేతితో తోశాడు. ఇది చూసి ఖాన్ కుమార్తె అరిబా ఆగ్రహించింది. వెంటనే కారు వద్దకు వెళ్లి రివాల్వర్ తెచ్చింది. గ్యాస్ స్టేషన్ సిబ్బంది రజనీష్ కుమార్ ఛాతికి గురిపెట్టింది. నీ కుటుంబం నిన్ను గుర్తుపట్టలేనంతగా చాలా బుల్లెట్లతో కాల్చేస్తానని బెదిరించింది. అక్కడున్న వారు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. దీంతో ఆ కుటుంబం కారులో అక్కడి నుంచి వెళ్లిపోయింది. మరోవైపు గ్యాస్ స్టేషన్ సిబ్బంది రజనీష్ కుమార్ ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అక్కడి సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. ఖాన్ కుటుంబాన్ని పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. అతడి పేరుతో రిజిస్టర్ అయిన లైసెన్స్ ఉన్న ఆ రివాల్వర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి నమోదు చేస్తున్నారు. కాగా, గ్యాస్ స్టేషన్‌లోని సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# ఎన్సీఆర్ కెనాల్‌లో దొరికిన మోడల్ శీతల్ మృతదేహం

న్యూఢిల్లీ, ఎన్సీఆర్‌లోని ఖాండ నుంచి జారోతి గ్రామాల మధ్య ఉన్న కెనాల్‌లో ఉన్న ఓ మహిళ మృతదేహాన్ని శీతల్‌గా గుర్తించారు. ఆమె హర్యానాకు చెందిన మోడల్. మ్యూజిక్ ఇండస్ట్రీలో ఆమెకు పేరున్నది. పానిపట్ సమీపంలోని ఖలీలా మజ్రా ఆమె స్వగ్రామం. ఇటీవల పానిపట్‌లోని సత్ కర్తార్ కాలేనీకి తన సోదరి నేహాతో కలిసి ఇల్లు మారింది. శీతల్ ఫోన్‌తో కాంటాక్ట్ తెగిపోవడంతో పానిపట్‌లోని ఓల్డ్ ఇండస్ట్రియల్ ఏరియా పోలీసు స్టేషన్‌లో ఆదివారం నేహా ఫిర్యాదు చేసింది. శీతల్ చివరిసారి తన బాయ్‌ఫ్రెండ్‌తో కనిపించినట్లు ఆమె కుటుంబసభ్యులు తెలిపారు. అతని కారును కూడా శీతల్ మృతదేహం లభించిన కెనాల్ వద్ద గుర్తించారు. శీతల్‌ను ఆమె బాయ్‌ఫ్రెండ్ అటాక్ చేసినట్లు సోదరి నేహా తెలిపింది. దాడి గురించి శీతల్ వీడియో కాల్ చేసినట్లు నేహా చెప్పింది. ఆ వీడియో కాల్ తర్వాత ఆమె కాంటాక్ట్ తెలియకుండా పోయిందని నేహా తెలిపింది. ఆదివారం రాత్రి కెనాల్‌లో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. పానిపట్ నుంచి ఓ అమ్మాయి మిస్సైనట్లు ఆదివారం తమకు సమాచారం వెల్లడైందని ఖ ర్కోడా పోలీసు స్టేషన్ ఇంచార్జ్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ప్రాథమిక విచారణ ఆధారంగా శీతల్ మృతదేహాన్ని గుర్తించారు. ఫ్యామిలీ సభ్యులతో పోలీసులు సంప్రదించారు. శీతల్ బాయ్‌ఫ్రెండ్‌తో పాటు ఇతర కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తున్నారు.

# సంచలన అంశాలు

అమరావతి, ఇటీవలే కూటమి ఏడాది పాలన పూర్తి చేసుకుంది. గత ఏడాది జూన్ 4న ఫలితాలు వచ్చాయి. అదే నెల 12న ప్రభుత్వం కొలువుదీరింది. సాధారణంగా ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో పాలనలో ఉన్న ఇబ్బందులను అధిగమించడానికి కొంత సమయం పడుతుంది. కానీ చంద్రబాబు రూపంలో సీనియర్ నేత ఉండడంతో.. తక్కువ రోజుల్లోనే పాలన గాడిలో పడింది. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత.. ఏడాది పాలనపై మిశ్రమ స్పందన వస్తోంది. ఇటీవల ప్రభుత్వం ఐవీఆర్ఎస్, సి ఎస్ డి ఎస్ పద్ధతిలో చేయించుకున్న సర్వేలో ఆసక్తికర ఫలితాలు వచ్చాయి. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు అవినీతి నియంత్రణపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించడం సంచలనం రేపుతోంది. అవినీతిని సహించేది లేదని హెచ్చరించడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది.

అవినీతిపై మాత్రం అసంతృప్తి..

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్టీఆర్ భరోసాపింఛన్లు పెంచి అందించిన విషయం విధితమే. అన్న క్యాంటీన్ల సేవలు ప్రారంభం, ఆసుపత్రుల్లో సేవలు మెరుగు, విద్యావ్యవస్థలో మార్పులు, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పనితీరుపై మాత్రం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే కొన్ని అంశాల్లో మరింత మెరుగుదల అవసరమని ఎక్కువమంది అభిప్రాయపడారు. కానీ మొత్తం ప్రభుత్వంతో పాటు ప్రభుత్వ పెద్దల పనితీరుపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. కానీ అవినీతి విషయంలో మాత్రం అసంతృప్తితో ఉన్నారు.గత ప్రభుత్వం మాదిరిగా అవినీతి కొనసాగుతోందని ఎక్కువ మంది చెప్పడం విశేషం. పింఛన్ల పంపిణీలు అవినీతి లేదంటూ 85 శాతం మంది చెప్తే.. పింఛన్లు ఇంటి వద్దే ఇస్తుండడంపై 87.8 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగుల ప్రవర్తన కూడా బాగుందంటూ 83.9 శాతం మంది తమ అభిప్రాయాలను చెప్పినట్లు తెలుస్తోంది. ప్రధానంగా అన్నా క్యాంటీన్లలో ఆహార నాణ్యత బాగుందంటూ 80 శాతం మంది తమ సంతృప్తిని వ్యక్తం

తల్లికి వందనంతో సంతృప్తి..

అయితే నిన్నటి వరకు ఒక ఎత్తు.. నిన్నటి నుంచి మరో ఎత్తు అన్నట్టు ఉంది ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి శాతం. సూపర్ సిక్స్ పథకాల్లో ప్రధానమైనదిగా భావిస్తున్న తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారు.

# యుద్ధం కాదు... చర్చలే దిక్కు!



న్యూఢిల్లీ,ఏ యుద్ధంలోనైనా కనబడే దూకుడే అయిదోరోజుకల్లా ఇజ్రాయెల్–ఇరాన్ ఘర్షణలో కనబడుతోంది. ఎవరికెవరూ తీసిపోకుండా క్షిపణులు, బాంబులు యథేచ్ఛగా ప్రయోగిస్తున్నారు. జనావా సాలను గురిచూస్తున్నారు. ప్రత్యర్థుల్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నట్టు ప్రకటించుకుంటున్నారు. ఇజ్రా యెల్ విమానాల బాంబుదాడుల్లో 406 మంది ఇరాన్ పౌరులు మరణించగా, 654 మంది గాయపడ్డారని వాషింగ్టన్‌లోని మానవహక్కుల కార్యకర్తలు ప్రకటించారు. అటు రాజధాని టెల్ అవీవ్‌తో పాటు పలు నగరాలపై ఇరాన్ సాగించిన క్షిపణి దాడులకు ఇజ్రాయెల్‌లో 14 మంది మర ణించగా, 390 మంది గాయపడ్డారని అక్కడి సైన్యం తెలియజేసింది. తొలుత అణుకేంద్రాలపై దాడులు చేశామన్న ఇజ్రాయెల్ రెండోరోజు నుంచి నగరాలూ, పట్టణాలూ లక్ష్యంగా చేసుకుని బాంబులు ప్రయోగిస్తోంది. తయారీరంగ పరిశ్రమలనూ, ఎలక్ట్రానిక్ పరిశ్రమలనూ, పోలీస్ స్టేషన్లనూ, మౌలిక సదుపాయాలనూ ధ్వంసం చేస్తోంది. ఒక్క తెహ్రాన్‌లోనే శని ఆదివారాల్లో 250 లక్ష్యాలను దెబ్బతీశామని చెబుతోంది. దక్షిణ ఇరాన్‌లోని ప్రపంచంలోనే అతి పెద్ద సహజవాయు క్షేత్రాన్ని, తెహ్రాన్ వెలుపల ఒక చమురు డిపోను ఇజ్రాయెల్ సైన్యాలు పేల్చివేశాయి. అణ్వస్త్రాల తయారీకి ఇరాన్ చేరువలో ఉన్నదని, అందుకే దాడులకు దిగామని ఇజ్రాయెల్ ఇస్తున్న సంజాయిషీ బూటకం. వాస్తవాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. అది శుద్ధిచేసిన యురే నియం నిల్వలు ఉంచుకున్నా, బాంబు తయారీకి దరిదాపుల్లో లేదని సాక్షాత్తూ అమెరికా ఇంటెలి జెన్స్ చీఫ్ తులసీ గబ్బార్డ్ కొన్ని వారాల క్రితం తెలిపారు. అణు ఒప్పందం గురించి అమెరికా– ఇరాన్‌ల మధ్య చర్చలు సాగుతుండగానే హఠాత్తుగా ఇరాన్‌పై ఇజ్రాయెల్ అణు ఆరోపణ ఎందుకు చేసినట్టు? ఇరాక్‌లో సద్దాం హుస్సేన్‌ను అడ్డు తప్పించటానికి ఆ దేశంలో రసాయన ఆయుధాలున్నాయని కపట నాటకమాడిన అమెరికా అడుగుజాడల్లో ఇజ్రాయెల్ నడుస్తోంది. ఆ సాకుతో సద్దాంను తప్పించి కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ప్రతిష్ఠిద్దామని అప్పట్లో అమెరికా, నాటో దేశాలు భావించాయి. కానీ జరిగిందంతా వేరు. రసాయన ఆయుధాల జాడలేదు సరిగదా... ఉగ్రవాదం మరింతగా విజృంభించింది. ఇప్పటికీ ఇరాక్ కుదుట పడలేదు. అఫ్గాన్, లిబియా, యెమెన్, సిరియాలు సైతం అదే దుఃస్థితిలో ఉన్నాయి. ప్రధాని నెతన్యాహూ రెండు లక్ష్యాలతో ఇరాన్‌పై విరుచుకుపడ్డారు. మతాచార్యుడు ఖమేనీ కనుసన్నల్లోని పాలకవ్యవస్థను పడగొట్టి అక్కడ తమకు అనుకూలమైన ప్రభుత్వం ప్రతిష్ఠించటం అందులో ఒకటైతే, రెండోది స్వదేశంలో తాను కోల్పోయిన పరువు తిరిగి పొందటం. అమెరికా, ఇజ్రాయెల్‌లు కలిసినా ఇరాన్‌లో తమకు అనుకూలమైన వారిని ప్రతిష్ఠించటం అసాధ్యం. ఆ రోజులు పోయాయి. 1970వ దశకం వరకూ ఇరాన్‌ను పాలించిన షా రెజాపెహ్లవీ వంటి అమెరికా కీలుబొమ్మ ఆ దేశంలో కొత్తగా పుట్టుకొచ్చే అవకాశం లేదు. ఇరాన్ ప్రతిఘటిస్తున్న తీరు చూస్తే నెతన్యాహూ రెండో లక్ష్యం కూడా నెరవేరే అవకాశం కనబడటం లేదు. పాలస్తీనాలో దిక్కూ మొక్కూలేని నిస్సహాయ పౌరులపై అమెరికా సరఫరా చేసిన మారణా యుధాలతో విరుచుకుపడటం వేరు. ఇప్పుడు ఇరాన్ జోలికి పోవటం వేరు. ఇరాన్ పౌరులకు తమ ప్రభుత్వంపై ఎంతైనా వ్యతిరేకత ఉండొచ్చుగానీ, కొన్ని దశాబ్దాలుగా వారంతా నిత్యం యుద్ధ రంగంలోనే ఉన్నారు. ఇప్పుడంటే సౌదీతో ఒక మేరకు స్నేహసంబంధాలు ఏర్పడ్డాయిగానీ ఆ దేశం కూడా ఇరాన్‌పై కత్తికట్టినదే. గతంలో ఇరాక్‌తో వైరం ఏర్పడినప్పుడు వరసగా పదేళ్లపాటు యుద్ధం సాగించిన దేశం ఇరాన్. ఎంతగా అమెరికా మద్దతున్నా ఈ మాదిరి సుదీర్ఘ యుద్ధాన్ని ఇజ్రాయెల్ ఆర్థికవ్యవస్థ తట్టుకోవటం అసాధ్యం. ఆ మాటకొస్తే అమెరికా ఆర్థిక వ్యవస్థే అంతటి మహాయుద్ధాన్ని భరించే స్థితిలో లేదు. 'ఉగ్రవాదంపై యుద్ధం' పేరిట పలు దేశాల్లో నాటో కూటమితో కలిసి సాగించిన యుద్ధాల పర్యవసానంగా ఇప్పటికే అమెరికా నిండా మునిగింది. దాని ప్రస్తుత రుణం 36 లక్షల కోట్ల డాలర్లు. ఆర్థికవ్యవస్థకొచ్చే ఆదాయంలో సింహ భాగం దానిపై వడ్డీలకే ఖర్చవుతోంది. ఇజ్రాయెల్‌కు వత్తాసుగా ఇరాన్‌తో వైరం పెట్టుకుంటే ఆ సుదీర్ఘ పోరు మరో పదిలక్షల కోట్ల డాలర్లను ఆవిరిచేస్తుంది. తాను అధికారంలోకొస్తే 'అనవసర యుద్ధాల' నుంచి అమెరికాను తప్పిస్తానని, ఒక్క సైనికుడు కూడా విదేశీగడ్డపై ఉండే అవసరం రాదని అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్ ఊదరగొట్టారు. అందుకే 'ఇజ్రాయెల్ జోలికెళ్తే ఖబడ్దార్' అంటూ ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించటాన్ని స్వపక్షంలో అత్యధికులు వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికీ మించిపోయింది లేదు. అణు చర్చలకు సిద్ధమంటోంది ఇరాన్. కాకపోతే ఇజ్రాయెల్ వద్ద పుష్కలంగా అణ్వాయుధాలుండగా... పౌర అవసరాలకు సైతం యురేనియం వాడకాన్ని అనుమతించబోమనటం తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయటమే అంటున్నది. నిజానికి ఒబామా హయాంలో అమెరికా ఆ వెసులుబాటు ఇవ్వటం వల్లనే 2015లో అణు ఒప్పందం సాకారమైంది. క్రితంసారి ఏలుబడిలో ట్రంప్ ఆ ఒప్పందాన్ని కాలరాశారు. ఇజ్రాయెల్ సృష్టించిన ఈ ఊబి నుంచి బయటపడాలంటే ఇప్పటికీ ట్రంప్‌కు ఆ ఒప్పందమే దిక్కు. ఈ నాలుగు రోజుల్లో డాలర్ విలువ పదిశాతం తరిగిపోయింది. ఇరాన్‌తో చర్చించి సమస్య పరిష్కారానికి సాయపడతామని జర్మనీ విదేశాంగమంత్రి యోహాన్ వాదెఫుల్ ముందుకొచ్చారు. అందుకు సిద్ధపడటమే అమెరికా ముందున్న ఏకైక మార్గం. కాదంటే ఇవాళ పశ్చిమాసియా కావొచ్చుగానీ... రేపు ప్రపంచమే పెను సంక్షోభంలో పడుతుంది. అప్పుడు ఆర్థిక పతనం నుంచి అమెరికాను ఎవరూ కాపాడలేరు.

# బండిపై ఎన్నికల కేసు కొట్టివేత

హైదరాబాద్, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు హైకోర్టులో ఊరట కలిగింది. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై నమోదైన కేసును న్యాయస్థానం కొట్టివేసింది. 2021 నవంబర్ 15న ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బండి సంజయ్ ర్యాలీ నిర్వహించారు. అనుమతి లేకుండా భారీ వాహనాలతో కాన్వాయ్ నిర్వహించారని ఎన్నికల అధికారి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఈ కేసు పెండింగ్‌లో ఉండగా.. తాజాగా హైకోర్టు కొట్టివేసింది.

# ఇరాన్ యుద్ధంతో చమురు ధరలపై ప్రభావం

టెహ్రాన్:ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య మొదలైన యుద్ధం తీవ్ర రూపం దాలుస్తుండటంతో చమురు ధరలకు రెక్కలొచ్చాయి. ఇక ఈ పోరు ఇతర గల్ఫ్ దేశాలకు కూడా వ్యాపిస్తే మాత్రం ప్రపంచ ఇంధనానికి జీవనాడి లాంటి హార్మూజ్ జలసంధి మూతపడే ప్రమాదం ఉంది. కేవలం కొన్ని కిలోమీటర్ల వెడల్పున్న ఈ ప్రదేశం నుంచి ప్రపంచం వాడే చమురులో ఐదో వంతు రవాణా అవుతుందంటే దాని ప్రాముఖ్యత అర్థం చేసుకోవచ్చు. అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పం–ఇరాన్ మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి ఇది. దీనిలో ఓ చోట అత్యంత ఇరుకుగా కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఇరు దేశాలు ఇందులో అత్యధిక భాగం తమదే అని చెబుతున్నాయి. దీనిలో రెండు షిప్పింగ్ లేన్లు ఉన్నాయి.ఇందులో వెరీలార్జ్ క్రూడ్ క్యారియర్లు సులువుగా ప్రయాణించగలుగుతాయి. దీనిలో ఒమన్ తీరం నుంచి నౌకలు పర్షియన్ గల్ఫ్‌లోకి ప్రవేశిస్తాయి. చమురును నింపుకొని ఇరాన్ సమీపం నుంచి హార్మూజ్‌ను దాటి బయటకు వస్తాయి. పశ్చిమాసియాలో ఈ యుద్ధం వల్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య సంక్షోభం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. ఈ ప్రభావం భారత చమురు మార్కెట్‌తో పాటు గ్యాస్ కంపెనీలపై ఆర్థికంగా ఒత్తిడి పడే అవకాశం ఉన్నది. ఐసీఐ సెక్యూరిటీస్ నివేదిక ప్రకారం.. ముడి చమురు ధర ప్రస్తుతం బ్యారెల్‌కు 73 డాలర్ల నుంచి 74 డాలర్ల వరకు ఉన్నది. అయినప్పటికీ.. చమురు మార్కెట్ కంపెనీల ఆదాయంపై ప్రభావితమవుతున్నది. అదే సమయంలో అప్‌స్ట్రీమ్ కంపెనీల ఆదాయం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నది. అప్‌స్ట్రీమ్ కంపెనీలు చమురు, గ్యాస్ పరిశ్రమ ప్రారంభ భాగంలో పని చేస్తుంటాయి. భూమి నుంచి చమురు, గ్యాస్‌ను వెలికితీసే పక్రియ. ఇది గ్యాస్ కంపెనీలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశాలున్నాయి. ఎల్ఎన్‌జీ ముడి చమురుకు సంబంధించింది. ముడి చమురు ధర పెరిగితే.. ఎల్ఎన్‌జీ ధర సైతం పెరుగు తుంది. చమురు ధరల్లో ఈ పెరుగుదల ఇప్పటికీ 2025 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పెరుగుదల కంటే తక్కువగా ఉందని పేర్కొంది. ప్రస్తుత పెరుగుదల గత నాలుగు సంవత్సరాల సగటు కంటే చాలా తక్కువగా ఉన్నది. ప్రస్తుతం, బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు దాదాపు 75 డాలర్లుగా ఉన్నది. ఇది 2026 ఆర్థిక సంవత్సరానికి విశ్లేషకుల అంచనా 68 డాలర్ల కంటే కంటే దాదాపు 6-7 డాలర్లు ఎక్కువ. అయినప్పటికీ, ముడి చమురు ధరలు 2022-25 సగటు కంటే 9డాలర్లు తక్కువగా.. 25 ఆర్థిక సంవత్సరం సగటు కంటే 4డాలర్లు తక్కువగా ఉన్నది. డిమాండ్ లేకపోవడం మార్కెట్‌ను ఆధిపత్యం చేస్తుంది. అయితే, ఇంధన కంపెనీ స్టాక్స్ హెచ్చుతగ్గులను చూస్తున్నాయి. ఇది ప్రపంచ అనిశ్చితుల మధ్య మార్కెట్ ఆందోళనలను ప్రతిబింబిస్తున్నది. దీని వెనుక కారణం హార్మూజ్ జలసంధిలో తీవ్రమవుతున్న సంక్షోభం కారణం. హార్మూజ్ జలసంధి ప్రపంచంలోని కీలకమైన సముద్ర మార్గాల్లో ఒకటి. ఎందుకంటే ఇది పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్‌ను కలుపుతుంది. ప్రపంచంలోని చమురు రవాణాలో ఎక్కువ భాగం ఈ మార్గం గుండా వెళుతుంది. భారతదేశం చమురు దిగుమతుల్లో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ, ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో సగానికిపైగా హార్మూజ్ జలసంధి గుండా వెళతాయి. ఈ మార్గంలో ఏదైనా ఆటంకాలు ఎదురైతే.. భారత్ ఇతర వనరులు, మార్గాల కోసం వెతకాల్సిన అవసరం ఏర్పడుతుంది. భారత్ అవసరాలకు వాడే చమురులో 40 శాతం ఈ మార్గం నుంచే రవాణా అవుతోంది. ఇరాక్, సౌదీ, యూఏఈ, కువైట్, ఖతార్ నుంచి మనం దిగుమతి



చేసుకొంటున్నాం. మన దేశం వినియోగించే ఇంధనంలో 90 శాతం వివిధ మార్కెట్ల నుంచి దిగుమతి చేసుకొంటున్నాం. ఈ క్రమంలో హార్మూజ్ జలసంధి మూసుకుపోతే.. ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవడంతోపాటు.. రవాణా, బీమా ఖర్చులు గణనీయంగా పెరుగుతాయి. దీంతో దేశీయంగా పెట్రోల్, డీజిల్, ఎల్ఎన్‌జీ ధరలకు రెక్కలు రావడం ఖాయం. దీంతో భారత ప్రభుత్వ రంగంలోని చమురు సంస్థల ఆర్థిక పరిస్థితి మళ్లీ దారుణంగా మారుతుంది. ఈ నేపథ్యంలో జూన్ 13న కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురి మాట్లాడుతూ దేశీయ అవసరాలకు సరిపడా చమురు సరఫరా అవుతుందని భరోసా ఇచ్చారు. ఇప్పటికే వివిధ దేశాలతో మనకు ఉన్న చమురు ఒప్పందాలకు తోడు.. మనకు ఉన్న వ్యూహాత్మక నిల్వలు 74 రోజులకు సరిపోతాయి. ఇరాన్ ఎన్నడూ హార్మూజ్ జలసంధిని మూయలేదు. వాస్తవానికి టెహ్రాన్ ఉత్పత్తి చేసే చమురులో 80శాతం చైనా కొనుగోలు చేస్తుంది. ఈ నేపథ్యంలో హార్మూజ్‌ను మూస్తే.. దాని ఆర్థిక వ్యవస్థ మరింత దిగజారుతుంది. గతంలో ఇరాన్–ఇరాక్ యుద్ధం సమయంలో కూడా ఈ జలసంధి తెరిచే ఉంది. 1973లో ఈజిప్ట్–ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమదేశాలపై నాడు సౌదీ అరేబియా, దాని మద్దతుదారులు చమురు వ్యాపారం నిలిపేశారు. కాకపోతే ఇప్పుడు అలాంటి నిర్ణయాలు పెద్దగా ప్రభావం చూపకపోవచ్చు. కొంతకాలం కిందట వరకు అమెరికా అత్యధికంగా ఇంధనం దిగుమతి చేసుకొనేది.. ఇప్పుడు అది కూడా భారీ ఎత్తున చమురును ఎగుమతి చేస్తోంది. ఈ మార్గం నుంచి నిత్యం 2 కోట్ల పీపాల చమురు వివిధ దేశాలకు వెళుతుంది. ఇది మొత్తం ప్రపంచం వినియోగించే దానిలో ఐదో వంతుకు సమానం. సౌదీ, ఇరాన్, యూఏఈ, కువైట్, ఇరాక్‌ల నుంచి ఎగుమతి అవుతోంది. ఇక లిక్విడ్ నేచురల్ గ్యాస్ రవాణాకు కూడా అత్యంత కీలకం. మూడింట ఒక వంతు ఎల్ఎన్‌జీ కూడా ఇక్కడి నుంచే వివిధ దేశాలకు చేరుతుంది. దీనిలో అత్యధికం ఖతార్ ఎగుమతి చేస్తుంది. ఈ జలసంధిలో ఏర్పడే ఏ అంతరాయమైనా ప్రపంచ వాణిజ్యాన్ని గజగజలాడిస్తుంది. దీన్ని గుర్తించిన అమెరికా బహ్రెయిన్‌లో తన ఫిఫ్త్ ఫ్లీట్ స్థావరాన్ని ఏర్పాటు చేసుకొంది. ఇక ఈ మార్గం నుంచి వచ్చే చమురు, ఎల్ఎన్‌జీ అత్యధికంగా భారత్, చైనా, దక్షిణ కొరియా, జపాన్ దేశాలకు ఎగుమతి అవుతోంది. 1980-88 వరకు జరిగిన ఇరాన్-ఇరాక్ యుద్ధం ప్రభావం జలసంధిపై పడింది. నాడు ఇరు దేశాలు పరస్పర ఎగుమతులను దెబ్బతీసేందుకు.. ట్యాంకర్లపై దాడులు చేసుకొన్నాయి. దీనిని ట్యాంకర్ వార్ అని కూడా అంటారు. ఆ సమయంలో వివిధ దేశాల పతాకాలపై ప్రయాణించిన దాదాపు 450కు పైగా నౌకలపై ఇరు దేశాలు దాడులు చేశాయి. తాజా యుద్ధం వల్ల ఈ జలసంధి మూసేస్తే పరిస్థితి దారుణంగా ఉండనుంది. ప్రధానంగా భారత్‌పై తీవ్ర ప్రభావం పడనుంది.

# కొండపల్లి మున్సిపాలిటీ టీడీపీ కైవసం

ఎన్టీఆర్ జిల్లా, ఎన్టీఆర్ జిల్లాలో మరో మున్సిపాలిటీని టీడీపీ కైవసం చేసుకుంది. కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను తెలుగుదేశం పార్టీ దక్కించుకుంది. చైర్మన్‌గా టీడీపీకి చెందిన చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్‌గా చుట్టుకుదురు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అలాగే వైస్ చైర్‌పర్సన్‌గా ఇండిపెండెంట్ అభ్యర్థి కరిమికొండ శ్రీలక్ష్మి ఎన్నికయ్యారు. అయితే కొండపల్లి మున్సిపాలిటీ ఎన్నికల ఫలితంపై తీవ్ర ఉత్కంఠం నెలకొంది. ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ దగ్గరుండి మరీ అక్కడి పరిస్థితులను పర్యవేక్షించారు. హైకోర్టు ఆదేశాల మేరకు సీల్డ్ కవర్లో తీర్పు ఫలితం అధికారుల వద్దకు వచ్చింది. ఈ క్రమంలో భారీ బందోబస్తు మధ్య సీల్డ్ కవర్‌ను తెరిచి.. ఫలితాలను ప్రకటించారు అధికారులు. కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను టీడీపీ దక్కించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మరికాసేపట్లో కొండపల్లి మున్సిపల్ చైర్మన్‌గా చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్ పర్సన్‌లుగా కరిమికొండ శ్రీలక్ష్మి, చుట్టుకుదురు శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కొండపల్లి మున్సిపాలిటీకి మొత్తం 29 వార్డులు ఉన్నాయి. ఇందులో 14 టీడీపీ, 14 వైసీపీ సరి సమానంగా కైవసం చేసుకున్నాయి. అలాగే ఒక ఇండిపెండెంట్ గెలుపొందారు. ఈ క్రమంలో ఇండిపెండెంట్ అభ్యర్థి టీడీపీకి మద్దతు ఇవ్వడం తెలుగుదేశం పార్టీ సీట్లు 15కు చేరాయి. దీంతో కొండపల్లి మున్సిపాలిటీ టీడీపీ సొంతమైంది. మరోవైపు 14 మంది వైసీపీ కౌన్సిలర్లకు గాను కేవలం 8 మంది సభ్యులు మాత్రమే హాజరవగా.. మిగిలిన వారు గైర్హాజరయ్యారు.

## బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు

లక్నో,ఉత్తర ప్రదేశ్‌లోని బాణసంచా కర్మాగారంలో సోమవారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఐదుగురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో తొమ్మిది మంది మహిళలు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరందిరినీ హుటాహుటీన దగ్గర్లోని ఆస్పత్రులకు తరలించారు. అటార్సి గ్రామంలోని టపాసుల తయారీ కేంద్రంలో ఈ పేలుడు సంభవించింది. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి అత్యవసర సేవలైన అగ్నిమాపక, అంబులెన్స్, పోలీసులు భారీగా చేరుకున్నారు. చనిపోయినవారి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం తరలించారు. ఈ ఘటన పై రాజబ్‌పూర్ పోలీస్ స్టేషన్ అధికారి మాట్లాడుతూ, 'ఈ రోజు మధ్యాహ్నం 12 గంటలకు అటార్సిలోని లైసెన్స్ పొందిన బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించింది. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే, పోలీసులు, అంబులెన్స్, అగ్నిమాపక దళం వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు మహిళా కార్మికులు మరణించారు. తొమ్మిదిమంది గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించాం. మృతదేహాలకు పోస్ట్‌మార్టం జరుగుతోంది. పేలుడు వెనుక గల కారణాన్ని దర్యాప్తు చేస్తున్నాం.' అని ఆయన వెల్లడించారు.

## మోడీకి అత్యుత్తమ పురస్కారం

న్యూఢిల్లీ, సైప్రస్ పర్యటనలో ఉన్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఆ దేశ అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ మకరియోస్ 3ను ప్రధానం చేశారు. ప్రధాని ఈ గౌరవాన్ని స్వీకరిస్తూ ఇరుదేశాల మధ్య ఉన్న స్నేహానికి ఈ అవార్డును అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ చేతుల మీదుగా మోదీ ఈ పురస్కారం అందుకున్నారు. రిపబ్లిక్ ఆఫ్ సైప్రస్ తొలి అధ్యక్షుడు మకరియోస్ 3 పేరుతో ఈ అత్యున్నత పురస్కారాన్ని ఏర్పాటు చేశారు. సైప్రస్ ప్రభుత్వ అవార్డు 140 కోట్ల మంది భారతీయులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్టు ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇరుదేశాల సంస్కృతి, సోదరభావం, వసుదైవ కుటుంబ భావనకు ప్రతీక అని చెప్పారు. రెండు దేశాల మధ్య క్రియాశీల భాగస్వామ్యం కొత్త శిఖరాలకు చేరుకుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాల తర్వాత సైప్రస్‌లో భారత ప్రధాని ఒకరు పర్యటించడం ఇదే ప్రథమం.అవార్డు ప్రదానానికి సంబంధించిన వీడియోను ప్రధాని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సైప్రస్ అవార్డు అందుకోవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని, ఇరుదేశాల మధ్య స్నేహానికి ఈ అవార్డును అంకితం చేస్తున్నామని చెప్పారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ఆదివారం సాయంత్రం సైప్రస్ చేరుకున్న ప్రధానికి నికోస్ క్రిస్టోడౌలిడెస్ విమానాశ్రయంలో సాదర స్వాగతం పలికారు. సైప్రస్ పర్యటన అనంతరం కెనడాకు మోదీ పయనమవుతారు. అక్కడ జరుగనున్న జీ-7 సదస్సులో పాల్గొంటారు. చివరిగా క్రొయేషియాలో అధికారిక పర్యటన జరుపుతారు.

# ఊపిరి పోసినట్టేనా ..!


న్యూఢిల్లీ,సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు లేదా ఆదేశం ఏదైనా చాలా సున్నితమైనది. చాలా ఆలోచనత్మకమైనటువంటి ఆదేశాలు గానే చెప్పాలి. ముఖ్యంగా విషయ ప్రాధాన్యం కన్నా భావ ప్రకటన స్వేచ్ఛకు పెద్ద పీట వేసింది. ప్రస్తుతం రాజకీయాలను, సమాజాన్ని కూడా శాసిస్తున్న టెలివిజన్ చానళ్ళ భవిష్యత్తును కూడా సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా చెప్పిందనే భావన తాజా ఆదేశాలు ఇచ్చింది. వ్యాఖ్యలు చేసింది ఒకరు.. శిక్ష అనుభవించే పరిస్థితికి వచ్చింది ఒకరు.. అన్నట్టుగా చర్చకు వచ్చిన కొమ్మినేని శ్రీనివాసరావు విషయంలో సుప్రీంకోర్టు భావ ప్రకటన స్వేచ్ఛకు పెద్దపీట వేసింది.ముఖ్యంగా జర్నలిజం స్వేచ్ఛకు మరింత ఉన్నత స్థానాన్ని, ఉన్నత గౌరవాన్ని, ఉన్నత హక్కును కూడా కల్పించింది. ఇది కేవలం శ్రీనివాసరావు కోణంలో చూస్తే అది తక్కువ చేసినట్టే అవుతుంది. దీనిని చాలా విస్తృతమైనటువంటి కోణంలో భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆలోచించినప్పుడు జర్నలిజం స్వేచ్ఛకు సుప్రీంకోర్టు ఇచ్చిన విస్తృత అర్థం మనకు కనిపిస్తుంది. నవ్వుతూ మాట్లాడినంత మాత్రాన, లేకపోతే వ్యాఖ్యాత చేసిన వ్యాఖ్యలపై నవ్వినంత మాత్రాన అరెస్టు చేస్తారా? అంటూ సుప్రీంకోర్టు సంధించిన ప్రశ్న టెలివిజన్ రంగానికి కీలకం.ఈరోజు అనేక చర్చలు టీవీలో జరుగుతూనే ఉన్నాయి. అనేక సందేహాలు, సమస్యలు, వివాదాలు, విమర్శలు వింటూనే ఉన్నాం . ఈ నేపథ్యంలో ఏ చర్చ ఎటు దారి మళ్లుతుందో? ఏ సమాజం ఏ ఛానల్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తుందో అనే ఒక భయానకమైన పరిస్థితి నేడు టెలివిజన్ రంగానికి పెను శాపంగా మారింది. ఇలాంటి పరిస్థితిలో జర్నలిజానికి, భావ ప్రకటన స్వేచ్ఛను ముడిపెట్టి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వ్యక్తిగతంగా కాకుండా వ్యవస్థీకృతంగా చూసినప్పుడు దీని విలువ, ప్రాధాన్యం మనకి స్పష్టంగా గోచరిస్తాయి. వ్యక్తిగా నేడు కొమ్మినేని కావచ్చు రేపు మరొకరు కావచ్చు.కానీ వ్యవస్థీకృతంగా ఉన్నది, ప్రజలకు చేరువైంది టెలివిజన్ రంగం. ఈ టెలివిజన్లలో వచ్చే చర్చలు, వ్యక్తుల భావాలు వారు మాట్లాడే సంభాషణ వంటి విషయాలను పరిశీలించినప్పుడు సుప్రీంకోర్టు స్పష్టమైన స్వేచ్ఛను కల్పిస్తూ అదే సమయంలో బాధ్యతాయుతమైనటువంటి విధానాలను కూడా క్రోడీకరించటం నిజంగా టీవీ డిబేట్లకు సుప్రీంకోర్టు భారీ స్వేచ్ఛను, ఊరటను కల్పించిందని చెప్పాలి. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు టీవీ చర్చలపై నమోదైన 32 కేసులను పరిశీలిస్తే తాజాగా ఇచ్చినటువంటి ఆదేశాలు భిన్నమైనవి. భవిష్యత్తును నిర్దేశించేవి కూడా అవుతాయి అనడంలో సందేహం లేదు.

# ఇజ్రాయెల్ దాడిపై 21 ముస్లిం దేశాల సంయుక్త ప్రకటన ఇదే!



టెహ్రాన్:ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ రెండు దేశాల మధ్య యుద్ధం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలకు గొడ్డలిపెట్టని జీ7 దేశాధి నేతలు అభిప్రాయపడ్డారని తెలుస్తోంది. ఈ సమయంలో ఇరాన్ పై ఇజ్రాయెల్ దాడిని తీవ్రంగా ఖండిస్తూ 21 అరబ్, ముస్లిం దేశాలు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.అవును... ఇరాన్ పై ఇజ్రాయెల్ వైమానిక దాడులను ఖండిస్తూ.. ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించడం, అణ్వాయుధ నిరాయుధీకరణ, అంతర్జాతీయ చట్టాన్ని గౌరవించడం కోసం పిలుపునిస్తూ 21 ముస్లిం, అరబ్ దేశాలు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఈజిప్టు విదేశాంగ మంత్రి బదర్ అబ్దేలట్టి చొరవ ఫలితంగా ఈ సంయుక్త ప్రకటన వెలువడింది. ఈ ప్రకటనలో... యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, టర్కియే, సౌదీ అరేబియా, సూడాన్, జోర్డాన్, పాకిస్తాన్, బహ్రెయిన్, గాంబియా, అల్జీరియా, బ్రూనై, చాడ్, కొమొరోస్, జిబౌటి, సోమాలియా, ఇరాక్, కువైట్, లిబియా, ఒమన్, ఖతార్, ఈజిప్ట్, మౌరిటానియా దేశాలు ఉన్నాయి. ఇరాన్ పై ఇజ్రాయెల్ శత్రుత్వాన్ని వెంటనే నిలిపివేయాలని ఆ దేశాలు పిలుపునిచ్చాయి. మరోవైపు... ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధాన్ని ఆపాలని జీ-7 దేశాధినేతలు పిలుపునిచ్చారు. వాణిజ్యం, యుద్ధాలే ఎజెండాగా కెనడాలోని రాకీ మౌంటెన్స్ లో ప్రారంభమైన జీ7 సదస్సులో స్పందించిన ట్రంప్... ఇరు దేశాలు వెంటనే చర్చలు జరపాలని సూచించారు. ఇదే సమయంలో.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించే మార్గాన్ని కనుగొనాలని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కోరారు. ఇదే సమయంలో... ఇజ్రాయెల్ దాడుల ఉద్ధృతి రోజురోజుకీ పెరుగుతుండటం తో పాటు అమెరికా స్వరం కఠినంగా మారుతుండటంతో అరబ్ మిత్ర దేశాల ద్వారా ఇరాన్ రాయబారం పంపినట్లు తెలుస్తోంది. అయితే.. ముందు అణు ఒప్పందానికి రావాలని టెహ్రాన్ కు తాను నిక్కచ్చిగా చెప్పానని జీ7 దేశాల సదస్సు సందర్భంగా ట్రంప్ స్వయంగా ఈవిషయాన్ని వెల్లడించారు. కాగా... ఇరాన్ క్షిపణి దాడుల్లో ఇప్పటివరకూ కనీసం 24 మంది మరణించారని, వందలాది మంది గాయపడ్డారని ఇజ్రాయెల్ అధికారులు తెలపగా.. ఇజ్రాయెల్ దాడిలో కనీసం 224 మంది మరణించారని, 1000 మందికి పైగా గాయపడ్డారని ఇరాన్ తెలిపింది.

# జనసేన.. భాజపా.. వై సైలెంట్ మోడ్



అమరావతి,రాష్ట్రంలో పాతిక మంది వరకు జనసేన-భాజపా ప్రజా ప్రతినిధులు వున్నారు. వీరి నుంచి ఎంపికైన మంత్రులు వున్నారు. వీరి యాక్టివిటీ ఏమైనా నిత్యం పత్రికల్లో కనిపిస్తోంది. ఎమ్మెల్యే కావచ్చు, ఎంపీ కావచ్చు, మంత్రులు కావచ్చు. వీళ్ల నిత్య కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారాలు, లేదా అఫీషియల్ మీటింగ్ లు, ఇంకా ఇంకా ఏవైనా సరే పత్రికల్లో కనిపిస్తున్నాయా? తెలుగుదేశం ప్రజా ప్రజా ప్రతినిధుల వార్తలతో పోల్చుకుంటే అస్సలు జనసేన, భాజపా ప్రతినిధులు వున్నారా? అన్నదే అనుమానంగా కనిపించేలా వుంది వ్యవహారం. ప్రజా ప్రతినిధులు అన్నాక నిత్యం ఏదో ఒక వ్యవహారం వుంటూనే వుంటుంది. సమీక్షా సమావేశాలు వుంటాయి. లోకల్ పర్యటనలు వుంటాయి. అధికారులకు ఆదేశాలు వుంటాయి. ఇంకా చాలా వుంటాయి. అదే మంత్రులు అయితే ఫుల్ బిజీగా వుంటారు. మరి ఎందుకు వీరి వీరి వార్తలు ఎక్కడా ఒక్కటి కూడా కనిపించడం లేదు. డిప్యూటీ సిఎమ్ పవన్, కీలక మంత్రి మనోహర్ వార్తలు అప్పుడప్పుడు కనిపిస్తున్నాయి. మిగిలిన వారి వార్తలు అస్సలు లేనే లేవు. మంత్రి సత్య కుమార్ ప్రభుత్వ పాలన ఆరంభంలో కాస్త కనిపించారు. ఇప్పుడు అస్సలు ఆయన వార్తలే కనిపించడం లేదు. పార్లమెంట్ సభ్యుడు సిఎమ్ రమేష్ అన్నిటా తానై కనిపించారు కొత్త ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలో. ఇప్పుడు అస్సలు ఆయన ఎక్కడున్నారో తెలియడం లేదు. ఆయన లోకల్ గా వుండి వుండొచ్చు, ఢిల్లీలో వుండి వుండొచ్చు. కానీ పత్రికల్లో మాత్రం కనిపించడం లేదు. ఇక జనసేన, భాజపా ఎమ్మెల్యేల సంగతి అయితే చెప్పనక్కరలేదు. ఎవరో, ఎక్కడో వార్తలు కనిపించడం లేదు. ఒక్కసారిగా ఓ గ్రూపు ప్రజా ప్రతినిధుల వార్తలు అన్నీ ఒక్కసారిగా మీడియాలో కనిపించకుండా పోవడం ఏమిటి? ఏదో జరుగుతోంది. అన్ని మీడియా సంస్థల్లో ఒక్కసారిగా అంత మంది యాక్టివ్ నెస్ కనిపించకుండా పోవడం అంటే ఏదో విషయం వుండాలి. ఏవో ఆదేశాలు వుండాలి. ఏదో ఆలోచన వుండాలి. లేదా వీరంతా తమ తమ పనులు చాలా సైలంట్ గా చేసుకుంటూ, వార్తలకు దూరంగా వుండి వుండాలి. మరో పక్క జనసేన ప్రజా ప్రతినిధుల మీద జనాల్లో అసంతృప్తి వుందని, వారు మళ్లీ టికెట్ ఇస్తే గెలవరు అంటూ సర్వే ప్రచారాలు ప్రారంభం అయ్యాయి. ఏడాది అయింది అంతే. అప్పుడే వాళ్ల భవిష్యత్ ఇలా డిసైడ్ చేసేస్తున్నారు. ఎందుకు? ఎలా? ఏదో వుంది. సమ్ థింగ్.. సమ్ థింగ్. ఇలా వుంటే రేపు భవిష్యత్ లో ఎన్నికల వేళ ఇబ్బందిగా వుండదా? తాము గెలిపించినా యాక్టివ్ గా లేరని జనం భావించరా? కావాలని ఈ ప్రజా ప్రతినిధులు అందరి గ్రాఫ్ పెరగకుండా చేస్తున్నారా? చూస్తున్నారా? ఇలా సైలంట్ మోడ్ లోకి వెళ్లిపోయినట్ల అనిపిస్తున్న ప్రజా ప్రతినిధులు అంతా ఆలోచించుకోవాల్సిన సమయం వచ్చింది. లేదూ అంటే నాలుగేళ్ల తరువాత టికెట్ రావడం, పోటీ చేయడం సంగతి అలా వుంచితే రాజకీయంగా ఎదగడం కష్టం అయిపోయే పరిస్థితి వుంటుంది. ఇప్పటి నుంచి గమనించి యాక్టివ్ కాకపోతే.

# రజనీకాంత్ కంటే విజయ్ ఎందులో గొప్ప

చెన్నై:నటుడు విజయ్ రాజకీయ పార్టీని నెలకొల్పి 2026లో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. కాగా ఈనెల 22న విజయ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఇప్పటి నుంచే ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవేడుకలో పార్టీ జిల్లా కార్యదర్శి ఏ.అప్పు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. 2026లో విజయ్ ముఖ్యమంత్రి కావడం తథ్యం అన్నారు. తమిళగ వెట్రి కళగం పార్టీకి తమిళ ప్రజలు ఓట్లు వేసి గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. 365రోజులు తమ తలైవన్ పుట్టినరోజును వేడుకను జరుపుకునే ఒకే ఒక్క పార్టీ తమిళగ వెట్రి కళగం అని ఆయన అన్నారు.

రజనీకాంత్ కంటే విజయ్ ఎందులో గొప్ప: వేల్మురుగన్

ఇదిలా ఉంటే తమిళ వాళ్ ఉరిమై పార్టీకి చెందిన వేల్మురుగన్ విజయ్‌పై విమర్శల దాడి చేశారు. ఒక వేడుకలో ఆయన మాట్లాడుతూ కరుణానిది పాలనలో పోరాడి, వాదాడి రాష్ట్రంలో 36 మెడికల్ కళాశాలను తీసుకొచ్చింది తానేనన్నారు. ఇప్పుడు రాజకీయాల్లోకి వచ్చిన నటులు తమిళ సమాజానికి చేసిందేమిటని ప్రశ్నించారు. ఒక నటుడు (విజయ్) 10,12వ తరగతి విద్యార్థులను అభినందించడానికి మాత్రమే సమావేశాలు నిర్వహిస్తున్నారని కౌంటర్ ఇచ్చారు.



సూపర్‌స్టార్ రజనీకాంత్, విజయకాంత్‌ల కంటే విజయ్ ఏమైనా గొప్పా అంటూ ఫైర్ అయ్యారు. చిన్న నటుడు బాలా కూడా తాను స్వయంగా సంపాదించిన డబ్బును పేదలకు సాయం చేస్తున్నారని, రాఘవ లార్సెన్ తాను సంపాదించిన మొత్తంలో వృద్ధులు, వికలాంగుల కోసం ఆశ్రమాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈయన మాత్రం సమావేశాలు మాత్రమే నిర్వహిస్తున్నారని ధ్వజం మెత్తారు.

# 'ఉపాధి హామీకి కేంద్రం పాతర..నిధుల ఖర్చుపై మోదీ సర్కారు పరిమితులు




న్యూఢిల్లీ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) మోడీ సర్కారు క్రమంగా పాతరేస్తోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పలు రకాల ఆంక్షలు విధిస్తూ నిర్వీర్యం చేస్తున్నది. తాజాగా మరో కొర్రీ పెట్టింది. పథకానికి కేటాయించిన నిధులను ఖర్చు చేసే విధానంపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిమితులను విధించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన మొత్తంలో 60 శాతం వరకు మాత్రమే మొదటి ఆరు నెలల్లో ఖర్చు చేయాల్సి ఉంది. ప్రజా సంఘాలు, ఈ పథకం లబ్ధిదారుల సంఘాలు, విపక్షాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఎందుకు ఈ పరిమితి?

కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ వెల్లడించిన సమాచారం ప్రకారం, కొన్ని సంవత్సరాలుగా ఈ పథకానికి కేటాయించిన వార్షిక బడ్జెట్‌లో దాదాపు 70 సెప్టెంబరునాటికే ఖర్చయిపోతున్నది. డిసెంబరులో అనుబంధ కేటాయింపులు జరిపారు, జనవరికల్లా ఖర్చయిపోతున్నాయి. ఫలితంగా ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేసరికి బాకీలు పెండింగ్‌లో ఉన్నాయి. గడచిన ఐదు ఆర్థిక సంవత్సరాల్లో పెండింగ్ బాకీలు రూ.15,000 కోట్ల నుంచి రూ.25,000 కోట్ల మధ్యలో ఉంటున్నాయి. తదుపరి ఆర్థిక సంవత్సరంలో కేటాయించే బడ్జెట్‌లో సగటున 20 శాతం వరకు ఈ బాకీల చెల్లింపులకే సరిపోతోంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ పథకం కింద ఖర్చులపై పరిమితి విధించడం ద్వారా ఆర్థిక సంవత్సరంలో రెండో సగ భాగానికి నిధులు అందుబాటులో ఉండేలా చేయవచ్చు. దీనివల్ల అదనపు కేటాయింపుల అవసరం ఉండదు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ పథకం కోసం కేంద్రం రూ.86,000 కోట్లు కేటాయించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో బాకీలు రూ.21,000 కోట్లు. 2025-26 బడ్జెట్‌లో 28 శాతం నిధులను కేంద్రం జూన్ 12 నాటికి విడుదల చేసింది. 2025-26లో బాకీలు రూ.3,262 కోట్లు, కేవలం ఈ బాకీలను చెల్లిస్తే, బడ్జెట్‌లో సుమారు 50 శాతం ఖర్చయిపోతుంది.

ఖర్చులపై పరిమితితో సమస్యలు

ఉపాధి హామీ పథకం కింద పని కోసం డిమాండ్ ఏడాది పొడవునా ఒకే విధంగా ఉండదు. వ్యవసాయ కార్యకలాపాలు, వాతావరణ పరిస్థితులను బట్టి ఒక్కొక్క నెలలో ఒక్కొక్క విధంగా ఉంటుంది. ఉపాధి హామీ పథకం ఎంజీఎన్ఆర్ఈ చట్టం, 2005 ప్రకారం అమలవుతోంది. ఈ చట్టాన్ని అమలు చేసే విధివిధానాలను నిర్ణయించే అధికారం ప్రభుత్వానికి మాత్రమే ఉంది. అయితే, ఈ అధికార పరిధి పరిమితం. జవాబులేని ప్రశ్నలువార్షిక బడ్జెట్‌లో 60 శాతం పరిమితిని చేరుకున్న తర్వాత ఏం చేయాలనేదానిపై స్పష్టత లేదు. కూలీలు డిమాండ్ చేసినప్పటికీ ఉపాధిని నిరాకరించే పరిస్థితులు రాష్ట్ర ప్రభుత్వాలకు రావచ్చు. లేదంటే, సకాలంలో చెల్లింపులు జరగకపోయినప్పటికీ పని చేయాల్సిన పరిస్థితి కూలీలకు రావచ్చు. డిమాండ్ చేసిన 15 రోజుల్లో ఉపాధి పొందడం, పని పూర్తయిన తర్వాత 15 రోజుల్లో వేతనాలను పొందడం కూలీల హక్కులు. ఆర్థిక శాఖ నిర్ణయం వల్ల ఈ చట్టం స్ఫూర్తికి విఘాతం కలుగుతోంది.

# ట్రాఫిక్ రూల్స్ బ్రేక్ చేస్తే...కెమెరాకు చిక్కాల్సిందే



హైదరాబాద్, హైదరాబాద్ సిటీలో కార్లు, బైక్‌లపై వెళ్తూ సిగ్నల్ జంప్ చేస్తున్నారా.. హెల్మెట్ పెట్టుకోకుండా ఓవర్ స్పీడ్ మెయింటేన్ చేస్తున్నారా.. ఇలా ఎలాంటి ట్రాఫిక్‌రూల్స్ బ్రేక్ చేసినా కెమెరాలు చూస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసుల నుంచి తప్పించుకున్నా కెమెరాల నుంచి తప్పించుకోలేరనే విషయం ట్రాఫిక్ చలాన్‌లను చూస్తే తెలుస్తుంది. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో 2024లో ప్రతిరోజు సుమారుగా 15,438 ట్రాఫిక్ చలాన్లు వేసిన ట్రాఫిక్ పోలీస్ అధికారులు. సామాజిక కార్యకర్త, ఆర్టీఐ యాక్టివిస్ట్ లోకేంద్రసింగ్ ట్రాఫిక్ చలాన్‌లపై అడిగిన సమాచారానికి పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు రోజుకు ఈ చలాన్లు మార్గాల్లో వేసినట్లుగా. ముఖ్యంగా సర్వేలెన్స్ సిస్టమ్‌తో పాటు కెమెరాల ద్వారా ట్రాఫిక్ చలాన్లు వేశారని అధికారులు ధ్రువీకరించారు. ఈ రోజువారి చలాన్లలో సుమారుగా 2వేల చలాన్లు ఏపీఎన్ఆర్ సిస్టమ్ వేసినట్లుగా ఉన్నాయి. హైదరాబాద్‌లో ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిస్టంలో భాగంగా ఆటోమెటిక్ నెంబర్ ప్లేట్ రికగ్నేషన్ (ఏఎన్‌పీఆర్)వ్యవస్థతో ట్రాఫిక్ రూల్స్ బ్రేక్ చేసే వారికి చాలన్లు విధిస్తున్నారు. ఎలాంటి ట్రాఫిక్ రూల్ బ్రేక్ చేసినా ఏఎన్‌పీఆర్ కెమెరాలు వెహికల్ నంబర్ ప్లేట్‌ను స్కాన్ చేసి ఆటోమెటిక్‌గా చలాన్ జనరేట్ చేయడంతో పాటు ఆ ఫొటోలు, బండి వివరాలు కమిషనరేట్ ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్‌కు చేరవేస్తాయి.

అధిక ట్రాఫిక్ ఉండేచోట ..

సిటీలో ప్రస్తుతం 284 ఏపీఎన్ఆర్ కెమెరాలు యాక్టివ్‌గా ఉన్నట్లు అధికారులు హైదరాబాద్‌లో ప్రధానంగా అధిక ట్రాఫిక్‌గా ఉండే సెంట్రల్, ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్ జోన్లలో ఉన్నాయని, అందులోనూ మేజర్ జంక్షన్లు అయిన ఎంజేమార్కెట్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, ఖైరతాబాద్, బషీర్‌బాగ్, పారడైజ్ సర్కిల్‌లలో ఉంది. ముఖ్యంగా ఎక్కువ ట్రాఫిక్ ఉండే వెస్ట్‌జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, ఎస్ఆర్‌నగర్‌లో అధిక సంఖ్యలో ఏఎన్‌పీఆర్ కెమెరాలు ఉన్నాయి, అదేవిధంగా సౌత్‌జోన్‌లో చంద్రాయణగుట్ట, హుస్సేనిఆలం వంటి చోట్ల తక్కువ కెమెరాలు ఉన్నట్లుగా వివరించబడింది.

రూ.56.34లక్షల చలాన్లు..!

హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌ని ట్రాఫిక్ పోలీస్ విభాగం గత సంవత్సరం రూ.56.34లక్షల చలాన్లు వేసినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఇందులో రూ. 4.61 లక్షలు వసూలు చేసినట్లు వారు పేర్కొన్నారు. సైఫాబాద్, బేగంపేట, నారాయణగూడ పోలీస్ స్టేషన్ల పరిధిలో దాదాపుగా 95శాతానికి పైగా చలాన్లు వసూలు చేస్తే అంబర్‌పేట, లంగర్‌హౌస్, సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కేవలం 31 శాతం లోపే వసూలయ్యాయని ట్రాఫిక్ పోలీసులు కలిగి ఉన్నారు.

# బీఆర్ఎస్ విలీనానికి ఈటల రోడ్ మ్యాప్!

హైదరాబాద్,బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అనూహ్యంగా బీఆర్ఎస్ పాట పాడుతున్నారు. కేసీఆర్ కు మద్దతుగా మాట్లాడుతున్నారు. ఆయన బీఆర్ఎస్ పార్టీని పొగుడుతూ.. కాళేశ్వరం కమిషన్ విషయంలో కేసీఆర్ కు అండగా ఉంటూ మీడియా ప్రకటనలు చేస్తున్నారు. ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. కమిషన్ ముందు ఇచ్చిన వాంగ్మూలం కూడా హైలెట్ అయింది. ఇప్పుడు ఆయన బీఆర్ఎస్ నాయకుడిగానే కనిపిస్తున్నారు. బీజేపీ తెలంగాణ అధ్యక్ష పదవికి పోటీ పడుతూ ఇలాంటి రాజకీయం ఎందుకు చేస్తున్నారన్నది హాట్ టాపిక్ గా మారుతోంది.

అధ్యక్ష పదవి కోసం వ్యూహాత్మక ఎత్తుగడ

ఈటల రాజేందర్ చాలా వ్యూహాత్మకంగానే బీఆర్ఎస్, కేసీఆర్ అనుకూల కామెంట్లు చేస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. బీజేపీని బీఆర్ఎస్‌లో విలీనం చేసే ప్రక్రియ సాఫీగా సాగాలంటే..దాన్ని అంగీకరించే నాయకుడు ఉండాలి. బండి సంజయ్ బీఆర్ఎస్ నీడను సహించేలా లేరు. ఇతరులు కూడా బీఆర్ఎస్ విలీనాన్ని వ్యతిరేకిస్తారు. కానీ తాను మాత్రం బీఆర్ఎస్ విలీనాన్ని స్వాగతిస్తానన్న సంకేతాలను హైకమాండ్ కు ఈటల పంపుతున్నారు. సాఫ్ట్ గా విలీనం పూర్తవుతుందన్న భరోసాను ఆయన ఇస్తున్నట్లుగా భావిస్తున్నారు.

బీఆర్ఎస్‌ను పొగడాల్సిన అవసరమే లేదు !

ఈటల రాజేందర్ సీనియర్ నాయకుడు. ఎలాంటి రాజకీయాలు చేయాలో ఆయనకు తెలుసు. భారత రాష్ట్ర సమితిలో ఎంత ఘోరమైన పరిస్థితుల మధ్య తాను బయటకు రావాల్సి వచ్చిందో ఆయనకు తెలుసు. జాతీయ పార్టీలో ఇప్పుడు ఆయన పలుకుబడి ఉన్న నేత. కేసీఆర్ కన్నా బెటర్ పొజిషన్ లో ఉన్నారు. ఇప్పుడు మళ్లీ తనను గెంటేసిన పార్టీలోకి వెళ్లాల్సిన అవసరం లేదు. వెళ్లరు కూడా. చాలా మంది కాళేశ్వరం వాంగ్మూలం తర్వాత ఈటల బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్తారని ప్రచారం చేస్తున్నారు. కానీ బీఆర్ఎస్ పార్టీనే బీజేపీలో కలిపే ప్రయత్నం చేస్తున్నారని ఊహించలేకపోతున్నారు.



హైకమాండ్ ఆలోచనను బట్టే !

బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తారా లేదా అన్నది ఇంకా స్పష్టత లేదు. కానీ గతంలో చర్చలు జరిగాయని నిర్ణయం తీసుకున్నారని కవిత చెబుతున్నారు. అది ఎప్పుడైనా జరగవచ్చన్న ఉద్దేశంతోనే కవిత సొంత కుంపటి పెట్టుకుంటున్నారు. కానీ ఇంకా బీజేపీ నుంచి ఎలాంటి స్పందన లేదు. వారు వ్యూహాత్మకంగా ఉంటారు. సమయం చూసి నిర్ణయం తీసుకుంటారు. బీఆర్ఎస్‌ను విలీనం చేసుకోవాలనే ప్లాన్ ఉంటే.. ఈటల రాజేందర్ నే అధ్యక్షుడిగా నియమిస్తా రని అనుకోవచ్చు. అలాంటి పరిస్థితుల్ని రాజేందర్ వ్యూహాత్మకంగా తెచ్చుకుంటున్నారు.

# జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం

విజయవాడ, జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలం గడుస్తున్న ప్రభుత్వం చేసిన తప్పుడు వాగ్దానాలు ప్రజలకు తెలిసే విధంగా పుస్తకాన్ని ఏర్పాటు చేశాం అన్నారు.

కూటమి సర్కార్ కేవలం వైసీపీ పార్టీని ఇబ్బంది పెట్టడం, వైసీపీ కార్యకర్తలని అరెస్టు చేసే పనిలోనే బిజీగా ఉన్నారని వెల్లంపల్లి అన్నారు. ఇక, కూటమి ప్రభుత్వాన్ని దేని గురించి అయినా ప్రశ్నిస్తే అరెస్టు చేస్తున్నారు అని మాజీ మంత్రి వెల్లంపల్లి పేర్కొన్నారు. ఇక, తల్లికి వందనం అనే పేరుతో రూ. 13 వేల రూపాయలు వేస్తానని చెప్పిన చంద్రబాబు.. ఎంతమంది విద్యార్థులకు తల్లికి వందనం ఇచ్చాడో చెప్పాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకుని, ఇప్పుడు అదే ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు.. గతంలో జగన్మోహన్ రెడ్డి పరిపాలన చేసినప్పుడు.. ఈ రాష్ట్రం శ్రీలంక అయిపోతుంది, అప్పుల్లో కూరుకుపోయిందని తప్పుడు ప్రచారం చేశారు చంద్రబాబు.. మరి ఇప్పుడు ఈ సంవత్సర కాలంలో చంద్రబాబు ఎంత అప్పు చేసాడో ప్రజలు చెప్పాలి వెల్లంపల్లి శ్రీనివాస్ అడిగారు. అయితే, 40 ఏళ్ల ఎక్స్ పీరియన్స్ ఉందని చెప్పుకొని తిరిగే చంద్రబాబు, దేశంలో



మోడీ కంట నేనే సీనియర్ అని చెప్పుకునే ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి తెలియదా అని వైసీపీ నేత వెల్లంపల్లి పేర్కొన్నారు. చంద్రబాబు అంటే పథకాలు అమలు చేయని వ్యక్తి.. ప్రజలు ఎవరికీ పథకాలు కూడా పథకాలు రావు.. ఎంతసేపు రెడ్ బుక్ అని భయపెట్టేలని తిరుగుతున్నారు.. ఎవరు భయపడడానికి సిద్ధంగా లేరు అన్నారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు ఈ పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరికీ చేరి విధంగా కృషి చేస్తామని వెల్లంపల్లి శ్రీనివాస్ చెప్పుకొచ్చారు.

# సీఎం హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్యలు

అమరావతి,: ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాల పర్యటనలకు తరచూ వాడే హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్యలు వస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇంటెలిజెన్స్ చీఫ్‌కు డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఆదేశించారు.

తాజాగా రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్.. అమరావతి నుంచి ఆ హెలికాప్టర్‌లోనే తిరుపతి వెళ్లారు. అక్కడి నుంచి కృష్ణపట్నం పోర్టుకు ఇదే హెలికాప్టర్‌లో వెళ్లేలా షెడ్యూల్ ఖరారు చేశారు. అయితే, ఆయన తిరుపతిలో హెలికాప్టర్ ఎక్కిన తర్వాత సాంకేతిక లోపం బయటపడింది. సీఎం చంద్రబాబు జిల్లా పర్యటనలకు వెళ్తున్నప్పుడు జీఎంఆర్ సంస్థకు చెందిన హెలికాప్టర్‌ను వాడుతుంటారు. అయితే, ఈ హెలికాప్టర్‌తో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తడంతో అధికార వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో కృష్ణపట్నం పర్యటనను కేంద్ర మంత్రి రద్దు చేసుకున్నారు. తరచూ ఈ హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో హెలికాప్టర్ వినియోగించవచ్చా? లేదా?స్పష్టంగా పేర్కొంటూ ఒక నివేదిక ఇవ్వాలని ఇంటెలిజెన్స్ చీఫ్‌కు డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఆదేశాలు జారీ చేశారు.

Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**